

Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షణము

సంపుటి: 82 • సంచిక: 21 • 25-5-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



ఒక్కరమే మిగులుతాము!

"నా మీద జరుగుతున్న సిబిఐ దాడుల వ్యవహారంలో రాజీ పడే ప్రశ్నే లేదు. ఇది సోనియాగాంధీ నాతో చేస్తున్న యుద్ధం. ఈ పోరాటంలో సోనియానో, నేనో ఒక్కరమే మిగులుతాము. నా శక్తులున్నంత వరకు ఈ పోరాటం ఆగదు"... సాక్షిలో తన కీలక సిబ్బందికి జగన్ పంపిన సందేశం ఇది. ఒక్కరమే మిగులుతాము అనే మాట ఆవేశపూరితంగా, సినిమాటిక్‌గా అన్నదా లేక దాని వెనుక ఏదైనా అంతరార్థం వుందా అన్న సంగతి తెలియదు. కానీ, సిబిఐ కేసులను ఎదుర్కోవడంలో ఆయనకున్న ఆత్మ విశ్వాసాన్ని మాత్రం ఇది ప్రతిఫలిస్తున్నది. సాక్షి దిన పత్రిక కానీ, టీవీ ఛానల్ కానీ ఆగబోవని ఉద్యోగులకు హామీ ఇవ్వడం కోసం ఆయనీ సందేశం పంపారు. వారిలో మనోధైర్యం కల్పించడానికి ఈ నెల

కొరవ 14వ పేజీలో

జగన్ అరెస్టుతో రాష్ట్రంలో ప్రళయం?

దొంగే.... దొంగా, దొంగా అని అరిస్తే? అదీ దొంగతనం జరగడానికి ముందే? తన అరెస్టు వూహాగానాలపై వైఎస్.జగన్ చేస్తున్న ప్రకటనలు, ప్రధానికి వ్రాసిన లేఖ ఈ తీరులోనే వున్నాయి. రేపు 28తేది అక్రమ ఆస్తుల కేసులో జగన్ కోర్టుకు హాజరు కావాల్సి వుంది. ఆ సమయంలో కోర్టు అనుమతితో జగన్‌ను అదుపులోకి తీసుకొనే అవకాశం వుందని న్యాయనిపుణులు అంచనా వేస్తున్నారు. గతంలో 2జి స్కాం సమయంలో ఇదే జరిగింది. డిఎంకె అధినేత కరుణానిధి కుమార్తె కనిమొళిపై సిబిఐ కేసు పెట్టింది. కానీ అరెస్టు చేయలేదు. ఆమె బెయిల్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. కానీ కోర్టు ఆ బెయిల్ దరఖాస్తును తిరస్కరించి, వెంటనే అరెస్టు చేయాల్సిందిగా సిబిఐని ఆదేశించింది. జగన్ విషయంలో కూడా ఇదే జరగబోతున్నదని న్యాయనిపుణుల అంచనా.

జగన్ సాధారణ వ్యక్తి కాదు. ఆయనకు రాష్ట్రంలో అపారమైన అనుచరగణం వుంది. ప్రజాభిమానం వుంది. అటువంటి వాడిని అరెస్టు చేయడం అంటే జనంలో అలజడి రేగడం ఖాయం. కోర్టు చుట్టూ వేలాదిగా జనం గుమిగూడడం సహజం. అటువంటి జన సమూహాలు ఎప్పుడేమి చేస్తాయో ఎవరూ వూహించలేరు. ఆ సమూహాలను నియంత్రించడం పోలీసుకు కత్తి మీద సాము వంటి పరీక్ష.

పైగా, జగన్ అనుచరగణం ఎంత ఆవేశపూరితమైనదో అందరికీ తెలుసు. ఎక్కడో ఒక విదేశీ ఇంటర్నెట్ వెబ్ సైట్‌లో వైఎస్ మరణం గురించి ఒక ఆధారంలేని వదంతి కన్పించగానే, రాష్ట్రం మొత్తం మీద రిలయన్స్ కంపెనీ ఆస్తులను క్షణాల వ్యవధిలో విధ్వంసం చేసి పారేశారు. సాక్షి సిబ్బందే స్వయంగా జగన్ అనుచరుల ఇళ్లకు వెళ్లి, రిలయన్స్ ఆస్తుల మీద దాడి చేయమని కోరారు. ఆ దృశ్యాలను వారే

కొరవ 14వ పేజీలో

అన్ని మతాలు, కులాలు, వర్గాలు ఒక్కటౌతున్నాయి!



జగద్గురు అభినవోద్ధానంద విద్యా నృశింహ భారతీ స్వామీజీ ఆశీర్వాదం తీసుకొంటున్న టిఎస్ఆర్



నెల్లూరు బిషప్ రెవరెండ్ ప్రకాశంతో కరచాలనం చేస్తున్న టిఎస్ఆర్.



మాజీ మంత్రి షబ్బీర్‌అలి, నెల్లూరు ముస్లిం మతపెద్దలతో టిఎస్ఆర్.

వ్యవస్థ కంటే వ్యక్తి గొప్ప వాడు కాలేడు. పార్టీ కంటే అభ్యర్థి పైన స్థాయికి చేరలేడు. కానీ ఈ అసాధ్యమైన విషయం నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గంలో సుసాధ్యం అవుతున్నది. కాంగ్రెస్ అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి పార్టీ కంటే మిన్నగా ప్రాచుర్యం పొందుతున్నాడు. అందుకొక ఉదాహరణ – కాంగ్రెస్ పార్టీకి దూరమైన వర్గాలు, కులాలు, మతాలు ఒక్కటిగా కలిసిపోయి ఆయనకు సంఘీభావం తెలపడం. ఈ ఎన్నిక తమదే అన్నంత ఆసక్తిగా సమర్థించడం.

సుబ్బరామిరెడ్డి జాతీయస్థాయి నేత. ఢిల్లీలో ఆయన పలుకుబడి తెలియని వారు లేరు. ఆయన ఇంట్లో ఏ చిన్న శుభ కార్యక్రమం జరిగినా ప్రధానితో సహా కేంద్ర క్యాబినెట్‌లో సగం మంది హాజరౌతారు. ఆధ్యాత్మిక రంగం గురించి చెప్పనే అవసరం లేదు. సుబ్బరామిరెడ్డి ఇటీవల విశాఖపట్నంలో జరిపిన ఒక సర్వమత సమ్మేళనానికి కాశి, వైష్ణోదేవి, తిరుమల, శబరిమల వంటి ప్రసిద్ధ ఆలయాలన్నిటి నుంచి అర్చకులు హాజరైనారు. వారితోపాటుగా ఢిల్లీ, అజ్మీర్‌ల నుంచి అత్యున్నత స్థాయి ముస్లిం మత పెద్దలు; కేరళ, మెదక్, బొంబాయిల నుంచి ప్రఖ్యాత క్రైస్తవ మత పెద్దలు కూడా హాజరైనారు. సిక్కు బౌద్ధ మతాల నుంచి సైతం హాజరు వుండింది. రాజకీయ, పారిశ్రామిక, సినిమా, ఆధ్యాత్మిక, కళా రంగాలన్నింటిలోనూ ఒక వ్యక్తి తిరుగులేని ప్రాశస్త్యాన్ని సాధించడం చాలా చాలా అరుదైన విషయం. ఎంతో పుణ్యం చేసుకొంటే తప్ప ఆ భాగ్యం సిద్ధించదు.

అటువంటి భాగ్యశాలి కాబట్టే నెల్లూరు ప్రజలు కూడా ఆయన పట్ల విశేషమైన ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. కాంగ్రెస్ మీద తమకు అభిమానం వున్నా లేకపోయినా సుబ్బరామిరెడ్డి అభ్యర్థిత్వాన్ని మాత్రం మనసారా స్వాగతిస్తున్నారు. ఈ పోకడకు ఒక సంకేతం, జిల్లాలోని అన్ని వర్గాలు, అన్ని కులాలు, అన్ని మతాల వారూ ఒక్కటిగా ఆయనకు సంఘీభావం తెలపడం. జిల్లా కాంగ్రెస్‌లో మున్నూట అరవై వర్గాలున్నాయి. ఒకరంటే ఒకరికి సరిపడదు. ఒకరితో ఒకరు కలిసి పని చేయరు. కానీ సుబ్బరామిరెడ్డి గారి విషయం వచ్చేసరికి అందరూ ఒకట్టై పోయారు. కుల సంఘాల సంగతి చెప్పనే అవసరం లేదు. అందరి కంటే ముందుగా యాదవ సంఘం తరఫున ఉడతా వెంకట్రావు, నారాయణ సుబ్బరామిరెడ్డిని స్వాగతించారు. మండల కేంద్రాలలో తమ కుల సంఘం సమావేశాలు జరిపి, అందరినీ చైతన్యం చేస్తున్నారు. ముదిరాజ్ సంఘానికి సంబంధించి రఘురాం ముదిరాజ్ ఉత్సాహంగా పని చేస్తున్నారు. బ్రాహ్మణ సంఘం తరఫున 20తేది పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఒక ఆత్మీయ సదస్సు జరిపారు. జగద్గురు అభినవోద్ధానంద విద్యా నృశింహ భారతీ స్వామీజీ ఈ సదస్సుకు హాజరై సుబ్బరామిరెడ్డిని ఆశీర్వదించారు. ఆర్యవైశ్యులు ఇప్పటికే చాలా సదస్సులు జరిపారు. 20తేది ఎస్‌బిఎస్ కళ్యాణ మండపంలో పెద్ద సభనే జరిపారు. ముక్కామల పీఠాధిపతి శ్రీధర్ స్వామీజీ దీనికి హాజరైనారు. మత పరంగా పలు క్రైస్తవ సంఘాలు సుబ్బరామిరెడ్డికి మద్దతు పలుకుతున్నాయి. ఈవారంలో నెల్లూరులోని చాలాదర్గాలు, మసీదులలో టిఎస్ఆర్ ప్రార్థన జరిపారు. మన్సూర్‌నగర్ ఖతీజా మసీదులో ముస్లిం సోదరులు ఒక ఆత్మీయ సభ జరిపి, ఆయనకు తమ మద్దతు ప్రకటించారు.

[దివాలాకు దగ్గరౌతున్నామా?]

దేశ ఆర్థిక వ్యవస్థ దివాలా దిశగా ప్రయాణిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయి. ప్రపంచం గర్వించే ఆర్థిక శాస్త్రవేత్త ప్రధానిగా వున్న సమయంలో ఇటువంటి అనుమానం వ్యక్తం చేయడం సహేతుకంగా కన్పించదు. కానీ అది నిజం. దేశాల ఆర్థిక ఆరోగ్యానికి విదేశీ మారక ద్రవ్య నిల్వలు, విదేశీ అప్పులు, నిరుద్యోగం, ఎగుమతులు దిగుమతుల మధ్య వ్యత్యాసం, ద్రవ్య లోటు వంటివి సంకేతాలు. ఇప్పటికిప్పుడు పరిస్థితి చూస్తే, వీటిలో ఒక్కటి కూడా ఆరోగ్యకరమైన స్థితిలో లేదు. రూపాయి విలువ దారుణంగా పతనమైపోయింది. దానితో పెట్రోల్ దిగుమతులకు పెద్ద ఎత్తున డాలర్లు ఖర్చు చేయాల్సి వస్తున్నది. మరొకప్రక్క విదేశీ సంస్థలకు చెల్లించవలసిన అప్పులు, వడ్డీలకు ఖజానా ఖాళీ అయిపోతున్నది. 2011 మే నెలలో ఒక డాలరు ధర 44 రూపాయలు. ఇప్పుడు దాని విలువ 59 రూపాయలు. అంటే రూపాయి విలువ ఒక్క ఏడాదిలో దాదాపు 25 శాతం పతనమై పోయింది. మనం విదేశాలకు చెల్లించవలసిన అప్పులు, వడ్డీలు, కొనుగోలు చేయవలసిన పెట్రోల్ ఉత్పత్తుల వంటివి కూడా 25శాతం పెరిగినట్లే లెక్క. అంత భారాన్ని మోసే స్థితిలో మన దేశం లేదు. ప్రస్తుతం మన విదేశీ మారక ద్రవ్య విలువలు కేవలం 320 బిలియన్ డాలర్లు మాత్రమే. ఈ ఒక్క సంవత్సరంలో చేయవలసిన విదేశీ చెల్లింపులకు దాదాపు 200 బిలియన్ డాలర్లు కావాలని అంచనా. ఈ లోటు పూడాలంటే, ఎగుమతులు గణనీయంగా పెరగాలి. కానీ గత సంవత్సరం మన మొత్తం దిగుమతులు 485 బిలియన్ డాలర్లయితే, ఎగుమతులు మాత్రం 300 బిలియన్ డాలర్లు దాటడం లేదు. అంటే ఏటా 185 బిలియన్ డాలర్ల లోటు ఏర్పడుతున్నదన్న మాట. ఈ లోటు పూడ్చుకోవడానికి వున్న మార్గం – ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ వంటి సంస్థల నుంచి అప్పులు తీసుకోవడం, కార్పొరేట్ కంపెనీలు సేకరించే బాండ్లు, షేర్ మార్కెట్‌లో విదేశీ పెట్టుబడుల వంటి వాటి ద్వారా జరగాలి. అయితే రూపాయి విలువ పతనం వల్ల విదేశీ అప్పులు భరించరానంత ఖరీదై పోతున్నాయి. దానితో అటు ప్రభుత్వం కానీ, ఇటు ప్రైవేటు రంగం కానీ విదేశాల నుంచి అప్పులు, బాండ్లు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నాయి. తెచ్చిన వాటికి తిరిగి చెల్లింపులు చేయలేక తంటాలు పడుతున్నాయి. షేర్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడిదారులు భారీ స్థాయిలో పెట్టుబడి వెనక్కు తీసుకొంటున్నారు. ఈ పరిస్థితులలో దేశ ఆర్థిక వ్యవస్థ దివాలా దిశగా ప్రయాణిస్తున్నది.

1990లో ఆపద్ధర్మ ప్రధానిగా చంద్రశేఖర్ వున్నప్పుడు ఇదే పరిస్థితి నెలకొని వుండింది. ఆ రోజు మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు కేవలం ఒక్క బిలియన్ డాలర్లు మాత్రమే. రెండంటే రెండు వారాల పెట్రోల్ దిగుమతికి మాత్రమే అది సరిపోయే దుర్గతి. ఆ తర్వాత ఏమి చేయాలో ఎవరికీ అర్థం కాలేదు. దానితో చంద్రశేఖర్ రిజర్వు బ్యాంక్ వద్ద వున్న 67 టన్నుల బంగారు నిల్వను లండన్ బ్యాంకులకు తనఖా పెట్టి, 2 బిలియన్ డాలర్లు అప్పు తెచ్చుకోవాలని చూశాడు. ఆ ప్రయత్నం దేశ ప్రజలందరి మనోభావాలను గాయ పరచింది. తీవ్రమైన అవమానంగా భావించారు. అయితే జూన్‌లో జరిగిన ఎన్నికలలో ప్రధానిగా వచ్చిన పివి.నరసింహారావు గారు, ఈ పరిస్థితిని చక్కదిద్ది, దేశాన్ని గాటన పెట్టాడు. అప్పట్లో ఆయనకు సహకారం అందించినవాడు ఇప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్. అయితే అదే మన్మోహన్‌సింగ్ ఇప్పుడు దేశాన్ని తిరిగి అదే దుర్గతికి దిగజార్చి వేస్తున్నాడు.

జమీన్‌రైతు

2004లో ఆయన అధికారానికి వచ్చే నాటికి మన విదేశీ అప్పు 100 బిలియన్ డాలర్లు (అప్పటి రుపాయి ధరలో 4 లక్షల కోట్లు) మాత్రమే. కానీ ఇప్పుడది 330 బిలియన్ డాలర్లకు (18 లక్షల కోట్ల రూపాయలు) పెరిగింది. ఇంత అప్పు చేసి ఏమి సాధించారన్నది ప్రశ్న. ఆనాడు చంద్రశేఖర్ పలెనే ఇప్పుడు మన్మోహన్‌సింగ్ కూడా ఇరాన్‌కు బంగారు ఇచ్చి, పెట్రోల్ దిగుమతి చేయాలని చూస్తున్నాడు. అంటే, ఈ ఇరవై ఏళ్ల ఆర్థిక సంస్కరణలు దేశాన్ని మరొకసారి తిరోగమనంలోకి ఈడ్చుక పోతున్నాయన్న మాట. దేశ ప్రజలంతా అప్రమత్తం కావాల్సిన పరిస్థితులివి. కేంద్ర ప్రభుత్వం దివాలా తీస్తే దాని ప్రభావం ప్రజల నిత్య అవసరాలు, ఇంటి స్థాయి బడ్జెట్ల మీద ఎంత దారుణంగా వుంటుందో వర్ణించి చెప్పలేము. ఖర్చు చేసే ప్రతి రూపాయికీ ఒకటికి పది ఆలోచనలు చేసి, జాగ్రత్త పడితే తప్ప ముందు ముందు సగటు మనిషి జీవితం చాలా దుర్భరంగా మారడం ఖాయం.

జనవాణి

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం!

మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు 60ఏళ్ల నిండిన సందర్భంగా స్పీకర్ మీరాకుమార్ నేతృత్వంలో ఇటీవల ఆ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనందకరం. ఈ సందర్భంగా తొలిపార్లమెంట్‌లో సభ్యులైన ఆంధ్రులు సుబ్రహ్మణ్యం, మోహన్‌రావులకు సన్మానం చేశారు. మన పార్లమెంటరీ వ్యవస్థ ఇంతకాలం మనగలగడం మామూలు విషయం కాదు. గతంలో గొప్ప వ్యక్తులు పార్లమెంట్‌లో వుండబట్టి అర్థవంతమైన చట్టాలు చేశారు. ఇప్పుడు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పొట్టవిప్పి చూడ పురుగులుండు... అంటూ వేమన శతకాన్ని గుర్తుకు తెస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కలకాలం కొనసాగాలంటే కొన్ని సంస్కరణలు తప్పని సరిగా చేయాల్సి వుంది.

వాస్తు రామచంద్ర నెల్లూరు

పెద్దాసుపత్రి ప్రాంగణాన్ని బాగుచేయండి!

నెల్లూరులోని దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వాసుపత్రి పరిసరాలన్నీ చెత్తా చెదారంతో నిండి వుంటున్నాయి. డాక్టర్ల క్వార్టర్లు, పోస్టుమార్టం గదులు అడవిలో వున్నట్లున్నాయి. పద్ధతీపాడు లేకుండా ఇక్కడ పెంచిన చెట్ల మధ్య సంఘ విద్రోహ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అనారోగ్యంతో చికిత్స పొందను వచ్చే వారికి స్వాంతన చేకూరేలా పరిసరాలు తీర్చిదిద్దవలసిన బాధ్యత జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులపై వుంది.

సి.హెచ్.సురేష్‌బాబు నెల్లూరు

ట్రాఫిక్‌ను సరిదిద్దండి!

నెల్లూరులో రానురాను ట్రాఫిక్ సమస్య జటిలమవుతుంది. బొల్లినేని హాస్పిటల్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు నిత్యం ఏ పది, పదిహేనుసార్లో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ముత్తుకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేటల్లోనూ ఇదే పరిస్థితులు కొనసాగుతున్నాయి. నగరంలోని ప్రధాన రోడ్లపై వందల మంది ట్రాఫిక్ పోలీసులు డ్యూటీలు చేస్తుంటారు. వీరెందుకు ట్రాఫిక్‌ను నియంత్రించ లేకపోతున్నారో అర్థం కావడం లేదు. విమర్శలెదురైనా నగరంలో రోడ్లను ఆక్రమించిన ట్రాఫిక్ ఐల్యాండ్లు, ఇతర అక్రమ కట్టడాలను కూల్చను కార్పొరేషన్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బి, పోలీసులు ఉప ఎన్నికల తర్వాత కార్యచరణకు దిగితే బాగుంటుంది.

పి. అరుణకుమారి నెల్లూరు

సాక్షిపై కక్షసాధింపు వద్దు!

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో వెలువడుతున్న 'సాక్షి' పత్రికకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను స్తంభింప చేయడం, ఆ పత్రికకు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వరాదంటూ ప్రభుత్వం, సిబిఐ నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదు.

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

29-5-1942
పేజీలు : 8 వెల: అణా

నెల్లూరు ముచ్చట్లు

టీ పార్టీ

జర్నలిస్టు అసోసియేషన్ తరపున మిత్రులు భైరవరసు హనుమంతరావు గారికి 'జమీన్‌రైతు' ఆఫీసులో 28వ తేది సాయంత్రం టీ పార్టీ యిచ్చారు. హనుమంతరావు గారు పత్రికా రచనలకు సంబంధించిన ఎన్నో విషయాలను గూర్చి యిష్టాగోష్టిగా ముచ్చటించి అమూల్య సలహాలనిచ్చిరి.

పరామర్శ

బుచ్చిలో ఇంత మంచి పేరు సంపాయించుకొన్నవారు దొడ్ల రుక్మిణమ్మ, బెజవాడ వెంకట కృష్ణారెడ్డి గారలు మాత్రమేనంటే యెవరూ మా మీదకు రారనుకొంటాను.

పాపం రుక్మిణమ్మ గారి కుమార్తె బిడ్డ 24వ తేది మరణించింది. దీన్తో ఆమె కుప్పకూలిపోయింది. అమ్మా! ఋణానుబంధ రూపేణా పశుపత్ని సుతాలయః అన్నమాట జ్ఞప్తికి దెచ్చుకొని ఊరడిల్లుడు.

హాస్య నట చక్రవర్తి రాళ్లపల్లి నటేశం గారికి 24వ తేది పత్నీ వియోగం సంభవించింది. ఔను భరింపరానిదే.

డాక్టర్ అప్పలనర్సమ్మ పెంపుడు బిడ్డ 'నిర్మల' రాలిపోయిందని దుఃఖ సముద్రంలో అట్టే మునిగి పోయింది. ఈశ్వరుని లీల. పుట్టిన పిందెలన్నీ నిలుస్తవా!

పెరోల్

డిటినూ్యగానున్న బస్వారెడ్డి శంకరయ్య(ఇందుపూరు) పది రోజులు పెరోల్ మీద 25వ తేది విడుదలై వచ్చారు. తల్లి, భార్య, బంధుమిత్రులను చూచి తిరుగా దేవిడీ చేరుకుంటారు.

50 ఏళ్ల క్రితం ఈవారం

25-5-1962
పేజీలు: 12 వెల: 0-20 న.పై

చిత్తూరు లోక్‌సభ బై ఎలక్షన్!

చిత్తూరు లోక్‌సభ ఉప ఎన్నికలో పోటీజేయుటకు చివరకు టి.ఎన్.విశ్వనాధరెడ్డి గారినే కాంగ్రెస్ అభ్యర్థిగా నిర్ణయించినట్లు ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొట్టిపాటి బ్రహ్మయ్య గారు ప్రకటించారు.

సాధారణ పరిస్థితులలో అయితే కాంగ్రెస్ టిక్కెట్ కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చేవో, దానిని సంపాదించేందుకు దరఖాస్తుదారులు ఎన్ని పాట్లు పడేవారో అందరికీ తెలిసిన విషయమే.

కానీ ఆ స్థానంలో అఖిల భారత స్వతంత్ర పార్టీ అధ్యక్షులు ఆచార్య రంగాగారు పోటీ చేస్తుండడం, ఎన్నికలకు లక్షల ధనం వెచ్చించ వలసి ఉండడం వల్ల కాబోలు పోటీచేయడానికి కాంగ్రెస్ వాదులెవ్వరూ ముందుకు రాలేదు.

రంగాగారితో పోటీజేయడానికి తగిన అభ్యర్థిని సెలక్టుజేయుటకు ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ప్రభృతులు ప్రత్యేక ప్రయత్నమే చేయవలసి వచ్చినట్లుంది.

మదనపల్లి వాస్తవ్యులు రాటకొండ నరసింహారెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా నిలుపడానికి ప్రయత్నించి విఫలులైనారట. తర్వాత ఎస్‌పి చంగల్రాయ నాయుడు గారిని పోటీకి సిద్ధం జేయడానికి ప్రయత్నించి, ఆయనకు అర్ధాంగ బలాలను సంతృప్తికరంగా కలిగిస్తాయని ఆశజూపినా, ఆయన కూడా అంగీకరించలేదట. ఆయనకిష్టంలేకపోయినా బలవంతపు బ్రాహ్మణార్థంగా విశ్వనాధరెడ్డి గారి చేత ఒప్పించి, కడకు ఆయననే కాంగ్రెస్ అభ్యర్థిగా నిర్ణయించారు.

నెల్లూరు ముచ్చట్లు

జమీన్‌రైతులో వార్తపై ఆరాతీసిన బాబు!

గత వారంలో నాలుగు రోజుల పాటు నెల్లూరులో పర్యటించిన తెలుగు దేశం పార్టీ సర్వాధినేత నారా చంద్ర బాబు నాయుడు దర్గామిట్టలోని హోటల్ లియోలో బస చేశారు. ఈ సందర్భంగా ఆయన మే 11వ తేది 'జమీన్‌రైతు' సంచికలో "అందరికంటే రెడ్లే అధికులు" శీర్షికతో ప్రచురితమైన వార్తను చదివి బిసిల సంఖ్య జిల్లాలో ఇంత ఎక్కువగా ఉన్నా వారిని తెలుగుదేశం పార్టీ వైపు మళ్లించుకోవడానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న అంశంపై పార్టీ ముఖ్య నాయకులతో చర్చించినట్లు తెలిసింది.

భానుడి భగభగలు

భానుడు నెల్లూరీయులపై చండ్ర నిప్పులు చిమ్ముతున్నాడు. ఎప్పుడూ లేనట్లుగా 19, 20, 21, తేదీల్లో 45 సెంటీగ్రేడు డిగ్రీల ఎండ నమోదయ్యింది. కావలిలో అయితే 46 సెంటీగ్రేడు డిగ్రీల వరకు ఎండ తీవ్రత వెళ్లింది. ఎండకు వయోబేధంతో సంబంధం లేకుండా అందరూ అల్లాడి పోతున్నారు. పర్యావరణ సమతుల్యతను మానవుడు పట్టించుకోకపోవడం వల్లే ఎండ, వానలు, చలి తీవ్రతలో విపరీతమైన మార్పులు కనపడుతున్నాయి.

జాయింట్ కలెక్టర్ రూటేవేరు!

నెల్లూరు జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ బయట చూసేందుకు ప్రశాంత వదనంతో కనపడతారు. కానీ ఆయన ప్రతి శనివారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో భూ సంబంధ కేసులపై నిర్వహించే కోర్టులో ఉగ్రనర సింహావతారం ఎత్తుతారు. కొన్నిసార్లు కలక్టరేట్‌లోని భూ పరిపాలనా సంబంధ విభాగంలో సిబ్బందిని, ఎమ్మార్వోలు, సర్వేయర్లపై అగ్గి మీద గుగ్గిలమవుతారు. కోర్టుకు హాజరైన కక్షిదారులను కొన్ని సార్లు లాలిస్తారు; మరికొన్నిసార్లు గద్దిస్తారు. మొత్తంమీద నాలుగు గోడల మధ్య జరిగే జాయింట్ కలెక్టర్ కోర్టులో అంతిమంగా కక్షిదారులకు న్యాయం జరుగుతుండడంతో వాళ్లు సంతోషంగా బయటకు రావడం జరుగుతుంది.

చిరంజీవిని చూడను ఎగబడిన జనం

రాజ్యసభ సభ్యుడు, సినీనటుడు చిరంజీవి కాంగ్రెస్ పార్టీ తరపున నెల్లూరు పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డికి మద్దతుగా 17, 18 తేదీల్లో చేసిన ప్రచారానికి మంచి స్పందన లభించింది. 17వ తేది అల్లూరు, బోగోలు, దగదర్తి, కావలి మండలాల్లో ఆయనను చూడను, ఉపన్యాసం వినను మండుటెండలో సైతం పెద్ద సంఖ్యలో జనం రావడంతో చూసి చిరంజీవికి ఉన్న జనాభిమానంపై మళ్లీ చర్చ మొదలయ్యింది.

మెయిన్ గేటు మూసేస్తే ఎలా?

నెల్లూరు కలక్టరేట్‌కు తూర్పు వైపున ఉన్న మెయిన్ గేటును 18వ తేది నుంచి మూసి ఉంచుతున్నారు. ఇదేమి టయ్యా అంటే ఎన్నికల నామినేషన్ దృష్ట్యా కలక్టరేట్‌కు ఎవరూ రాకుండా ఈ పని చేశామంటున్నారు. కలక్టరేటు గేటు తెరచి ఉంచాలి. నామినేషన్ సమయంలో జనం రాకుండా చర్యలు తీసుకోవాలేగాని రోజంతా మూసి ఉంచితే ఎలా డిఆర్వోగారు!

ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం నాది!

విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం తమ ఘనతని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డిలు చెప్పుకొంటున్నారని వాస్తవానికి ఈ పథకానికి రూపకర్తను తానేనని మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పుకొచ్చారు. 19వ తేది నర్తకి సెంటర్‌లో జరిగిన బహిరంగసభలో ఈ విషయాన్ని వెల్లడించారు.

అడ్మిషన్లు జరుగుచున్నవి
Play Class to X
మరియు నవోదయ
SRI NETAJI MSR
శ్రీ నేతాజీ
Pilot High School
Opp: Vijayamahal, Nellore -1
Ph: 2329470, 85005 52203
హాస్టల్ వసతి కలదు

బ్రాహ్మణ
వివాహ సంబంధాలకు
: సంప్రదించండి :
Ph : 0861 - 6527494
email : svsmarriagelinks@live.com

దొంగలు - గజదొంగలు

ఇదేమీ సినిమా పేరు కాదు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలను విమర్శించేందుకు వాడుకొన్న శీర్షికలివి. 19వ తేది నెల్లూరు నగరంలో చంద్రబాబు నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడిన చంద్రమోహన్ రెడ్డి కాంగ్రెస్ దొంగల పార్టీ అయితే, వైఎస్ఆర్ కాంగ్రెస్‌ని గజదొంగల పార్టీగా అభివర్ణించారు.

వైకాపాలోకి పులిమి శైలజ

నెల్లూరు మాజీ మేయర్ పులిమి శైలజారెడ్డి 18వ తేది మేకపాటి రాజమోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత కొన్ని రోజులుగా రాజకీయాలకు దూరంగా ఉన్న ఆమె వైకాపాలో చేరడం చర్చనీయాంశమయ్యింది.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online‌లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423‌లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా
స్వదేశంలో రూ.200/-
విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190

తాగునీటికి కటకట

జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అదనపు జాయింట్ కలెక్టర్, డిఆర్వో వంటి పెద్ద పెద్ద అధికారులుండే జిల్లా కలక్టరేట్‌లో తాగునీటికి ప్రజలు కటకటలాడవలసి వస్తుంది. కలక్టరేట్‌లో రకరకాల పనుల నిమిత్తం నిత్యం వందలాది మంది సందర్శకులు వస్తుంటారు. ఈ ఎండాకాలంలో దాహం తీర్చుకోను గుక్కెడు నీళ్లులేక వాళ్లు పడుతున్న బాధలు ఇప్పటివరకు ఏ అధికారి దృష్టికి



నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం టి.సుబ్బరామిరెడ్డికి మద్దతునిస్తూ తయారు చేసిన కరపత్రాన్ని విడుదల చేస్తున్న రాజ్యసభ సభ్యుడు చిరంజీవి. ప్రక్కన బాలసుధాకర్, సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, తిక్కవరపు సుబ్బరామిరెడ్డి.

రాకపోవడం దారుణం. కలక్టరేట్‌లో ఈ పరిస్థితి బాధాకరం. తక్షణం తాగునీటి వసతి ఏర్పాటు చేయండి సార్!

ఆకర్షిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆఫీసులు

నెల్లూరు నగరంలో వివిధ సెంటర్లలో పెడుతున్న కాంగ్రెస్ పార్టీ ఆఫీసులు చూసేందుకు ఆకర్షణీయంగా ఉన్నాయి. రాజీవ్‌గాంధీ, ఇందిరమ్మ ఫ్లెక్సీలు కార్యాలయాల లోపల సుబ్బరామిరెడ్డి ఫోటోల అమరిక బాగుంది.

24న టిఎస్ఆర్ నామినేషన్

నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డి 24వ తేది నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకొంటున్నారు.

మేకపాటి నామినేషన్

నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మేకపాటి రాజమోహన్ రెడ్డి 23వ తేది ఉదయం 11.16 నిమిషాలకు నామినేషన్ దాఖలు చేశారు.

సిపిఎం నామినేషన్ దాఖలు

సిపిఎం పార్టీ నెల్లూరు పార్లమెంటు స్థానానికి పోటీచేస్తున్న చంద్ర రాజగోపాల్ 21వ తేది నామినేషన్ దాఖలు చేశారు.

వజ్రం - బంగారం - వెండి
ఫ్యాక్టరీ అవుట్‌లెట్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై*
తరుగు 6% నుండి - కూలి లేదు.
వెండి వస్తువులపై*
తరుగులేదు - కూలిలేదు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు*
*T&C Apply
గోల్డ్ ప్యాలెస్
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2331133, 2327611

కలెక్టర్‌ను ప్రశంసించిన ఎన్నికల కమిషనర్

జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డికి ఎన్నికల కమిషనర్ నుంచి ప్రశంసలు లభించాయి. జిల్లాలో పార్లమెంటు, శాసన సభ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో ఓటర్లను చైతన్యపరచేందుకు ఓటు విలువ తెలియజెప్పడంలో కలెక్టర్ చేపట్టిన వివిధ కార్యక్రమాలను తెలుసుకొన్న ఎన్నికల కమిషనర్ భన్వర్‌లాల్ ఆయన్ను అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా ఈ ప్రశంసలు లభించాయి. ఈ కార్యక్రమాలను మిగతా ఉప ఎన్నికలు జరిగే ప్రాంతాలలోను చేపడుతున్నట్లు భన్వర్‌లాల్ ప్రకటించారు.

లక్షలు దొరుకుతున్నాయి

ఎన్నికల్లో నగదు, మద్యం పంపిణీని అరికట్టేందుకు పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. వివిధ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 18.05 లక్షల నగదు, 40.49 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, 907 మద్యం బాటిళ్లు దొరికినట్లు జిల్లా ఎస్పీ రమణ కుమార్ ప్రకటించారు.

సిఐడి డిఎస్పీపై ఫిర్యాదు

మనీ సర్క్యులేషన్ స్కీం వ్యవహారంపై అధికారుల పాత్రపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆరోపణలు వస్తున్నాయి. వీటికి బలం చేకూర్చుతున్నట్లు సిఐడి డిఎస్పీ విజయకుమార్‌పై

కొరవ 14వ పేజీలో

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్
925 STERLING SILVER*
EXPORT QUALITY
వెండి వస్తువులపై*
తరుగు లేదు, కూలి లేదు.
*T&C Apply
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2331132, 2331121

తెలుగుదేశంలో అవినీతిపరులు లేరు!

● నెల్లూరు నర్తకి సెంటర్ సభలో చంద్రబాబు!



నర్తకి సెంటర్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు.

నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వంటేరు వేణుగోపాల్‌రెడ్డికి మద్దతుగా 18వ తేది నగరంలో నారా చంద్రబాబు నాయుడు చేసిన రోడ్‌షో విజయవంతమైంది. రాత్రి ఏడు గంటలకు విఆర్‌సి సెంటర్‌లో ప్రారంభమైన ఈ రోడ్‌షో ఎనిమిది గంటలకు నర్తకి సెంటర్ చేరుకొంది. పెద్ద సంఖ్యలో గుమిగూడిన కార్యకర్తలను ఉద్దేశించి చంద్రబాబు ఉద్వేగంగా ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీ పెట్టి 30 ఏళ్లయ్యింది. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం తప్ప మరో ధ్యాస లేదు. దీనివల్లే ఆ రోజుల్లో ఆర్థికంగా ఎలా ఉన్నామో ఈనాటికీ నేను, చంద్రమోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బల్లి దుర్గాప్రసాద్, రమేష్ రెడ్డి అలానే ఉన్నాము. కానీ ఠికానాకు లేని కాంగ్రెస్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నాయకులు కోట్లకు పడగలెత్తారు. కళ్లు తిరిగే ఆస్తులు సంపాదించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దోచుకోవడం వల్లే ఇది సాధ్యమయిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పెట్టిన పత్రికలో రోజుకు నాలుగు పేజీలు నా గూర్చి వ్యతిరేకంగా వ్రాస్తారు. టీవీల్లో మూడు గంటలు వ్యతిరేక వార్తలు చదువుతారు. అవినీతి పునాదుల మీద పెట్టిన ఆ పత్రికలాంటివి తాను తలచుకొంటే ఎన్నో పెట్టి ఉండేవాడినని చంద్రబాబు చమత్కరించారు. వెనుకబడిన రాష్ట్రాలైన బీహార్, గుజరాత్ అభివృద్ధి పథాన పయనిస్తుంటే ఆంధ్రప్రదేశ్ తిరోగమన బాటపట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనే కారణమన్నారు. జగన్‌లాంటి రౌడీ మనస్తత్వం ఉన్న వారిని గెలిపిస్తే రాష్ట్ర ప్రజల విలువైన ఆస్తులు కూడా దోచేస్తారని చివరికి నర్తకి హాలు సైతం ఆయన స్వంతమైపోతుందని జనం హర్షధ్వానాల మధ్య చంద్రబాబు అన్నారు.

ఓటరు కార్డు కోసం ప్రదక్షిణలు!

ఎన్నికల కమిషన్ ప్రకటనతో తంటా

ఉప ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటరు కార్డు తప్ప మిగిలిన గుర్తింపు కార్డులను అనుమతించబోమని ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఓటరు గుర్తింపు కార్డు కోసం తహశీల్దార్ కార్యాలయాలు, ఈ – సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. మొన్నటి కోవూరు ఉప ఎన్నికల్లో ఏదో ఒక గుర్తింపు కార్డు చూపి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అంగీకరించింది. అయితే ప్రస్తుతం జరగబోవు ఉప ఎన్నికల్లో ఓటు వేయాలంటే తప్పనిసరిగా ఓటరు కార్డు కలిగి ఉండాలన్న నిబంధన విధించింది. ఇప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఓటరు జాబితాలు గందరగోళంగా ఉన్నాయి. అవగాహనలేని వారిని బూతుస్థాయి అధికారిగా నియమించి రెవిన్యూ అధికారులు బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారు. ఓటరు గుర్తింపు కార్డు పొందేందుకు ఇప్పటి నుంచి తిప్పలు పడక తప్పదం లేదు.

కోటంరెడ్డి కష్టం – రమేష్‌రెడ్డి బాధ!





నెల్లూరు నగర తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఎప్పటికి మెరుగయ్యేనో తెలియని అగమ్యగోచర పరిస్థితులు నేడు కళ్లకు కడుతున్నాయి. తిలాపాపం తలా పిడికెడన్నట్లు ఈ పరిస్థితికి చంద్రబాబునాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తాళ్లపాక రమేష్‌రెడ్డి కారకులనాలి. తన చిత్తం వచ్చినట్లు ప్రవర్తించే తాళ్లపాక రమేష్‌రెడ్డి అంటేపడని చంద్రబాబు నెల్లూరు నగర, రూరల్ పార్టీలకు ఇన్‌ఛార్జీలను ఏళ్ల తరబడి పెట్టకపోవడంతో పార్టీ క్యాడర్ వైఎస్‌ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీల్లోకి వెళ్లిపోయింది. ఎట్టకేలకు కన్వీనర్‌గా రమేష్‌రెడ్డిని, అధ్యక్షునిగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ప్రకటించేసరికి ఆ పార్టీలో సందడి బదులు నిర్వేదం అలముకొంది. గతవారం రెండు రోజులపాటు నెల్లూరులో ఉండిన చంద్రబాబు పర్యటన, రోడ్‌షోలకు మనిషికి ఒక్కరికి 500 రూపాయలను కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చెల్లించి ప్రోగు చేయాల్సి వచ్చింది. వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలో శుభం పలకాల్సిన బాధ్యత ఉన్న రమేష్ రెడ్డి పార్టీ, తనదైవం ఎన్టీఆర్ వల్ల మంత్రి, ఎమ్మెల్యే, మునిసిపల్ ఛైర్మన్‌గా పనిచేసిన తాను అన్నివిధాల దెబ్బతినిపోయి రోడ్డుపై నిలబడి ఉన్నానని చెప్పుకోవడం చర్చనీయాంశమైంది. పైపెచ్చు పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేస్తున్న వంటేరు వేణుగోపాల్‌రెడ్డి సైతం జాగ్రత్తగా ఉండాలని చంద్రబాబు ప్రక్కనే ఉండిన నర్తకి సెంటర్ సభలో చెప్పడం చర్చనీయాంశమయ్యింది. నెల్లూరు నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసినా జనం ఆదరించకపోవడానికి 'డబ్బు' ఒక్కటే కారణం కాదని రమేష్‌రెడ్డి తెలుసుకొని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి పూర్తిగా సహకరిస్తే తప్ప నెల్లూరులో తెలుగుదేశం పార్టీ కోలుకోదని చెప్పకతప్పదు.

కడప మెజార్టీని నెల్లూరు అధిగమించాలి!

● నెల్లూరులో చేస్తున్న పాదయాత్రలో మైనార్టీ నేత అబ్దుల్ అజీజ్ పిలుపు.



అబ్దుల్ అజీజ్ సమక్షంలో వైకాపాలో చేరుతున్న ముస్లిం సోదరులు.

నెల్లూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డికి మద్దతు కూడగడుతూ నెల్లూరు నగరంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత హాజీ అబ్దుల్ అజీజ్ చేస్తున్న పాదయాత్రకు విశేష స్పందన లభిస్తుంది. 19తేది అబ్దుల్ అజీజ్ ముస్లిం జనాభా ఎక్కువగా వుండే టెక్మిట్ట, శాంతినగర్, బట్వాడిపాళెం ప్రాంతాల్లో పర్యటించారు. స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల మేలు పొందని వారు లేరు. వారంతా జగన్మోహన్‌రెడ్డి నిలబెట్టిన మేకపాటి రాజమోహన్‌రెడ్డికి ఓటు వేసి కడపలో జగన్మోహన్‌రెడ్డికి వచ్చిన మెజార్టీని అధిగమించేలా చూడాలని పిలుపునిచ్చారు.

ప్రజల మనస్సుల్లో నుంచి వైఎస్‌ను తొలగించలేరు!

డైకస్‌రోడ్డు, పుచ్చలపల్లి సుందరయ్య కాలనీల్లో అబ్దుల్ అజీజ్ చేపట్టిన పాదయాత్రలో వందలాది మంది పార్టీ అభిమానులు కదం తొక్కుతూ వెంట నడిచారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ ప్రజల మనస్సులో శాశ్వతంగా నిలచిపోయిన వైఎస్‌ఆర్‌ను వారి మనస్సులలో నుంచి తొలగించడం ఎవరివల్లా కాదన్నారు.

వైకాపాలో భారీగా చేరిన ముస్లింలు!

నెల్లూరు హరనాథపురంలోని హాజీ అబ్దుల్ అజీజ్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యాలయంలో 150 మంది ముస్లింలు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హాజీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నేడు పార్టీలో చేరిన ప్రతిఒక్కరూ వైఎస్‌ఆర్ చేపట్టిన సంక్షేమ పథకాల లబ్దిదారులేనన్నారు. చిన్న చిన్న చేతి వృత్తులు చేసుకొని జీవించే ముస్లింలు తమ పిల్లలను ఇంజనీరింగ్, డాక్టర్ కోర్సులు చదివిస్తున్నారంటే అది స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి చలవేనన్నారు. దీనికి రుణం తీర్చుకోను వైకాపా తరపున నెల్లూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



టెక్మిట్టలో ముస్లిం మహిళల స్థితిగతులను అగిడి తెలుసుకొంటున్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత హాజీ అబ్దుల్ అజీజ్.

ఈ కార్యక్రమంలో ఆనం వెంకటరమణారెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ అనిత, రైతు నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి, నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గ మైనార్టీ విభాగం ఇన్‌ఛార్జ్‌లు అబ్దుల్ జలీల్, ఇలియాజ్‌లు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో కాకాణి, మేకపాటి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి.

కాంగ్రెస్, తెలుగుదేశాలకు గుణపాఠం చెప్పండి!

ఉప ఎన్నికల్లో ఢిల్లీ పెద్దల దిమ్మ తిరిగేలా ఓటర్లు తీర్పు ఇవ్వాలని వైఎస్ ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అల్లూరు మండలంలో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో వున్నప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి తెచ్చారన్నారు. అలాంటి మహానేతకు అప్రతిష్ట కలిగేలా సిబిఐ చార్జ్‌షీట్‌లో పేరు చేర్చడం దారుణమన్నారు. ఆ దుశ్చర్య చూసి ఓర్వలేకనే తాను ఎమ్పీ పదవికి రాజీనామా చేశానన్నారు. వైఎస్ ఆశయాలను సాధించగల సత్తా ఒక్క జగన్‌కే వుందన్నారు. ఉప ఎన్నికల్లో డబ్బుతో గెలవాలని చూస్తున్న కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఇచ్చే తీర్పు కీలకమని దీనిని దృష్టిలో వుంచుకొని ప్రజలు ఓటు అనే వజ్రాయుధంతో తీర్పు చెప్పాలన్నారు. మేకపాటి త్యాగాన్ని ప్రజలు విశ్వసించారని ఆయన్ను అఖండ మెజార్జీతో ప్రజలు గెలిపించనున్నారని ఆ పార్టీ కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో కావలి ఇన్‌చార్జ్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, శ్యాం ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవీంద్రనాధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు

ఆర్టీసి డిపోలో సోమరులు!

డీజల్ లేక మార్గమధ్యంలో ఆగిన హైదరాబాద్ బస్సు

ఆర్టీసి అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం హైదరాబాద్ వెళ్లే బస్సు మార్గమధ్యంలో నిలిచిపోవడం. దూరప్రాంతాలకు వెళ్లే బస్సులో తగినంత ఇంధనం వుందో లేదో, కండిషన్‌లో వుందా అని పరీక్షించుకొని బస్సులు నడపాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది అలసత్వం కారణంగా ఆత్మకూరు నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సు 30 కిమీ దూరం కూడా పోకమునుపే వింజమూరు – దుత్త లూరు మధ్య నిలచిపోయింది. వున్నట్లుండి బస్సు ఆగిపోవ డంతో అందులో వున్న ప్రయాణికులకు అర్థం కాలేదు. చీకట్లు కమ్ముకోవడం, అటవీ ప్రాంతం కావడంతో కొంత ఆందోళనకు గురయ్యారు. తీరా బస్సు డ్రైవర్ ట్యాంకులో డీజల్ లేదని చెప్పడంతో వారికి పట్టరాని ఆగ్రహం వచ్చింది. సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులో ఇంధనం వున్నది లేనిది చూసుకోరా అని మండిపడ్డారు. చివరకు ఆత్మకూరు డిపో అధికారులకు సమాచారమందించడంతో ఆత్మకూరు నుంచి వేరొక వాహనంలో డీజిల్ తెచ్చి బస్సులో నింపడంతో దాదాపు 2 గంటల తర్వాత బస్సు బయలుదేరింది. దీనిపై ఆత్మకూరు డిపో మేనేజర్ కె.పి. శెట్టి మాట్లాడుతూ బస్సు డ్రైవర్, ఆయిల్ నింపే కాంట్రా క్టర్ నిర్లక్ష్యం వలనే ఇలా జరిగిందని చెప్పి చేతులు దులు పుకొన్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు ఆత్మకూరు డిపోలో జరిగివున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వదలిపెట్టి ప్రయాణికుల భద్రత, సౌకర్యాలపై దృష్టి సారిం చాల్సి వుంది.

బిట్రగుంటకు పూర్వ వైభవం తెస్తా!



బిట్రగుంట సభలో మాట్లాడుతున్న టి.సుబ్బరామిరెడ్డి.

రైల్వేపరంగా బిట్రగుంటను అన్ని విధాలా అభివృద్ధిపరచి గత వైభ వాన్ని తీసుకవచ్చేందుకు కృషి చేస్తానని పార్లమెంటు నియోజక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి హామీ ఇచ్చారు. రాజ్యసభ సభ్యుడు, మెగాస్టార్ చిరంజీవితో కలసి ఆయన బోగోలు మండలంలో రోడ్‌షో నిర్వ హించారు. ఈ సందర్భంగా సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ బిట్రగుంటను మినీ ఇంగ్లాండ్‌గా మారుస్తానన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం జీవి తాన్ని అంకితం చేస్తానని చెప్పారు. చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వ పథ కాలు రద్దయ్యాయని చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. కొందరు రాజ కీయ ద్రోహులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన ఏ పథకము రద్దు కాలేదని స్పష్టం చేశారు. వైఎస్‌ను రెండుసార్లు ముఖ్యమంత్రిని చేసింది సోనియాగాంధీ అని, అలాంటి వ్యక్తిని ఆయన కుమారుడు జగన్ నోటికొచ్చినట్లు మాట్లాడడం అతని ప్రవర్తనకు నిదర్శనం అన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేసి సుబ్బరామిరెడ్డిని గెలిపించాలని కోరారు.

జగన్మోహన్‌రెడ్డి వైపే యువజనం!

- నెల్లూరు పాదలకూరురోడ్డులో జరిగిన రోడ్‌షో సక్సెస్.
- పార్లబడి వచ్చిన యువకులు, మహిళలు.
- జగన్‌పై కుట్రలు అడ్డుకోవాలంటే వైకాపాకే ఓటు వేయాలన్న మేకపాటి.

నెల్లూరు నగరంలో 20తేది రికార్డు స్థాయిలో 45 సెంటీగ్రేడ్ డిగ్రీల ఎండకాసింది. ఈ ఎండ వేడిమిని భరించలేక జనం ఇళ్లలో సేద దీరుతున్న సమయాన ఆదివారం సాయంత్రం పొదలకూరు రోడ్డు సెంటర్ నుంచి డైకస్‌రోడ్డు సెంటర్ వరకు నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మేక పాటి రాజమోహన్‌రెడ్డి చేపట్టిన 'రోడ్‌షో' దిగ్విజయంగా నడిచింది. వీరిలో యువజనమే జాస్తి. రోడ్ షోలో పాల్గొన్న జీపుపై మేకపాటి రాజ



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మేకపాటి, కాకాణి, వెంకటరమణారెడ్డి.



రోడ్‌షోలో కోటంరెడ్డి, మేకపాటి, గోవర్ధన్‌రెడ్డి, వెంకట రమణారెడ్డి.

మోహన్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం వెంకట రమణారెడ్డి, డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ వంటి నేతలు న్నారు. వెంగళరావు నగర్, నేతాజీనగర్, పద్మావతి సెంటర్లలోని అడ్డ వీధుల గుండా సాగిన ఈ రోడ్‌షో చూడను ఇళ్లలోని మహిళలు పెద్ద సం ఖ్యలో వచ్చారు. బ్యాండ్ మేళం, టపాసుల మోత, పూలవర్షంలో తడచి ముద్దవుతూ రాజమోహన్‌రెడ్డి బృందం ముందుకు సాగిపోయింది.

జగన్‌పై కుట్రలు చేస్తున్నారు

రోడ్‌షోలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం జన నేత వైఎస్.జగన్మోహ న్‌రెడ్డిపై రకరకాలుగా కుట్రలు పన్నుతుందన్నారు. దీనిలో భాగంగానే ప్రజల పక్షాన నిలబడి వాస్తవాలను వ్రాస్తున్న సాక్షిపత్రిక, సాక్షి టీవీలను మూయించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. విజ్ఞత కల్గిన నెల్లూరు ఓటర్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మద్యం, డబ్బు ప్రలోభాలకు గురికాకుండా ఓటర్లు ఓటు విలువను చాటి చెప్పాలన్నారు. అప్పుడే జగన్మోహన్‌రెడ్డిపై చేయివేయను అందరూ దడు స్తారన్నారు. రాష్ట్రంలో స్వర్ణయుగ పరిపాలన జగన్మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి అయితేనే సాధ్యపడుతుందన్నారు.

పలువురి చేరిక

30వ డివిజన్‌కు చెందిన పలు పార్టీల నాయకులు ఈ సంద ర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిలో టిడిపికి చెందిన విజ యకుమార్, మాజీద్ అజీమ్, సిపిఎం నాయకుడు ప్రసాద్, ఐఎన్‌టి యుసి మాజీ గౌరవాధ్యక్షుడు ప్రభాకర్‌రావుతోపాటు 150 మంది ముఖ్య కార్యకర్తలున్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎమ్పీ మహాసము ద్రం జ్ఞానేంద్రరెడ్డి, హాజీ అబ్దుల్ అజీజ్, బండ్లమూడి అనిత, డాక్టర్ బాల చెన్నయ్య, మాజీ ఎమ్మెల్యే చెన్నారెడ్డి పెంచలరెడ్డి, వేమిరెడ్డి హంసకుమా ర్‌రెడ్డి, మలిరెడ్డి రవీంద్రనాధ్‌రెడ్డి, మురళి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



నెల్లూరు పొదలకూరురోడ్డు రోడ్‌షోలో జనసందోహం.

ఆత్మకూరులో పట్టుకోసం తాపత్రయం!

మూడు పార్టీలది ఇదే పరిస్థితి

నెల్లూరు పార్లమెంటు స్థానానికి జరుగనున్న ఉప ఎన్ని కల్లో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొనింది. కాంగ్రెస్, తెలుగుదేశంతోపాటు వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ వైకాపా, కాంగ్రెస్‌కు మధ్యే పోటీ నెలకొనింది. ఆర్థికమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఈ నియోజకవర్గం ప్రాధా న్యత సంతరించుకొంది. ఎవరికి వారు తమ పట్టు నిలుపు కొనేందుకు తంటాలు పడుతున్నారు. మంత్రి ఆనం వ్యూహాత్మ కంగా వ్యవహరిస్తూ కార్యకర్తలతో చర్చిస్తూ, మండలస్థాయి నేతలతో మంతనాలు సాగిస్తున్నాడు. ఇక తెలుగుదేశంపార్టీ నియోజకవర్గంలో బలహీనపడింది. గతంలో బాగా పట్టున్న ఆ పార్టీ ఇంతగా వెనుకబడడానికి నాయకత్వ సమస్యే కారణం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో పలు పార్టీల నేతల చేరికతో కొత్త ఊపు వస్తుంది. ఇప్పటికే మాజీ శాసనమండలి సభ్యుడు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు అల్లారెడ్డి కృష్ణారెడ్డి వైకాపాలో చేరగా, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు త్వరలో ఆపార్టీలో చేరుతున్నట్లు సంకేతాలు అందు తున్నాయి. పార్టీ ఒకవైపు బలపడుతున్నా, అదేస్థాయిలో వర్గ పోరు మొదలైనట్లు సమాచారం. ముందుగా పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యమివ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మొత్తం మీద నియోజకవర్గంలో మూడుపార్టీలకు ఉప ఎన్ని కలు జీవన్మరణ సమస్యగా మారాయి.



జొన్నవాడలో కామాక్షితాయి, మల్లికార్జునస్వామి వార్ల కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు.



నెల్లూరుకు వచ్చిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకి లియో హోటల్‌లో బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటుచేసి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న రావి మోహన్ చౌదరి.

● ఆత్మకూరు తహశీల్దార్ కార్యాలయంలో

అవినీతి తిమింగలాలు!

ఆత్మకూరు మండలం తహశీల్దార్ కార్యాలయం అవి నీతి మయంగా మారింది. ఈ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఇక్క డకు వచ్చే ప్రజలు ఆశ్చర్యపోక తప్పడం లేదు. ప్రతి చిన్న పని జరగాలన్నా లంచం డిమాండ్ చేస్తుంటారు. లంచం ఇవ్వని వారిని నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారు. అధికార పార్టీకి చెందినవారి పనులు మాత్రం చకచకా పూర్తి చేసి పంపుతుంటారు సామాన్య ప్రజలకు ఒక విధంగాను, పలుకుబడి కలిగిన వారికి మరో విధంగానూ ఇక్కడ పనులు జరుగుతున్నాయి. ఇటీవల ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోతాలు కూడా పలుకుబడి కలిగిన వారికే అందిం

ప్రతి పనికీ ఓ రేటు

చారన్న ఆరోపణలున్నాయి. సన్న చిన్న కారు రైతులు మాత్రం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చింది. గతంలో ఆత్మకూరు తహశీ ల్దార్‌గా పనిచేసి బదలీపై వెళ్లిన శ్రీనివాసమూర్తి ప్రతి గ్రామంలో విఆర్వో కార్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించాలన్న సంకల్పంతో 15 కార్యాల యాలు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలో ఏ మండలంలో లేని విధంగా ఇక్కడ విఆర్వో కార్యాలయాలు ఏర్పాటు చేయ డంపై జెసి అభినందించారు. అయితే ప్రస్తుతం విఆర్వో కార్యా లయాల గురించి పట్టించుకునే వారు లేకుండా పోయారు. పలు కార్యాలయాలు ఇప్పటికే మూత పడ్డాయి. తహశీల్దార్, ఇతర అధికారులు పరిపాలనపై సరైన దృష్టి సారించకపోవ డంతో విఆర్వోలను ప్రజలు వెతుక్కుంటూ వెళుతున్నారు.

● కోడూరు బీచ్‌లో

ఆకతాయిల వీరవిహారం!

పోలీసులకు పట్టదా?

ఆదివారం నాడు కోడూరు బీచ్‌కు వచ్చే ఆకతాయిలతో స్థానికులు హడలెత్తి పోతున్నారు. నెల్లూరు, తదితర ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలపై మితిమీరిన వేగంతో రావడం వల్ల మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్యం సేవించడంతోపాటు ద్విచక్ర వాహనాల్లో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. సౌత్ ఆములూరు, మహాలక్ష్మి పురం, నరుకూరు కూడళ్లలో ఆదివారం నాడు పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అంతే కాకుండా అల్లీపురం దగ్గర నుంచి కోడూరు బీచ్ వరకు మద్యం బెల్ట్ దుకాణాలు ఏర్పాటై ఉన్నాయి. ఈ రహదారిలో ఆదివారం, సెలవు దినాల్లో ప్రమాదాలు జరుగు తున్నా స్థానిక పోలీసులు నియంత్రించలేక పోతున్నారు. కోడూరు బీచ్ వద్ద పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయడంతోపాటు రవాణా శాఖ అధికారులు వాహనాలపై నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.

● సీతారాంపురం పిహెచ్‌సిలో

నిధుల దుర్వినియోగం!

జిల్లాలోని సీతారాంపురం ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో నిధుల దుర్వినియోగం జరిగింది. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మాశిలామణి ఈ పిహెచ్‌సిని తనిఖీ చేయడం జరిగింది. 2011–12 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆసుపత్రి అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు దాదాపు మూడు లక్షల డెబ్భై ఐదు

తనిఖీ చేసిన డిఎంఅండ్‌హెచ్ఓ

వేల రూపాయలకు లెక్కలు చూపడం లేదు. ఇటీవల మం దుల కొనుగోలు కోసం 30వేల రూపాయలు విడుదల చేస్తే సూదులను కూడా కొనుగోలు చేయకపోవడం గుర్తిం చారు. డిఎంఅండ్‌హెచ్ఓ తనిఖీలో సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమో జారీ చేయాలని ఆదేశించారు.

ధర్నాలతో దద్దరిల్లిన కావలి!

ఏకమైన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల ఐక్యకార్యాచరణ సమితి చేపట్టిన ధర్నా ఫలితంగా కావలి ఆర్డీఓ కార్యాలయం నినాదాలతో దద్ద రిల్లింది. వివిధ డిమాండ్లపై వైకాస చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పాల్గొ న్నారు. జెఏసి నాయకులు ఉస్మాన్ మాట్లాడుతూ 2012 జనవరి నుంచి రావాల్సిన డిఏను వెంటనే ప్రకటించాలని, సమ్మెహక్కును హరించే జీవో 177ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వశాఖలో ఖాళీగా వున్న వివిధ పోస్టులను భర్తీ చేయాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధ తులకు స్వస్తి చెప్పాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జానకిరామ్ డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘం కావలి డివిజన్ అధ్యక్షుడు రామ సుబ్బారావు మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను ఎత్తివేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కోరారు. ఈ ధర్నాలో జెపిసి నాయ కులు సురేష్ బాబు, ఉన్నం శ్రీనివాసులు, చలపతిశర్మ, జాఫర్‌ఖాన్ తది తరులు పాల్గొన్నారు.

లాట్రైట్ అక్రమ రవాణా!

● రుద్రకోటలో విలువైన నిక్షేపాలు

కావలి మండలంలో లాట్రైట్ అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతోంది. సిమెంటు పరిశ్రమల్లో దీనికున్న డిమాండ్‌ను ఆసరా చేసుకొని కొందరు అక్రమంగా వీటిని త్రవ్వి తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. మండల పరిధిలోని రుద్రకోట గ్రామంలో దాదాపు 87 ఎకరాల్లో విలువైన లాట్రైట్ నిక్షేపాలు వున్నాయి. సిమెంటు కంపెనీలకు దీని అవసరం వుండడంతో కొందరు నేతలు అధికారులతో చేతులు కలిపి లాట్రైట్‌ను జిల్లా సరిహ ద్దులు దాటేస్తున్నారు. లీజు పేరుతో భూములను చేజిక్కించుకొని అక్రమ త్రవ్వకాలు జరిపి కోట్లు గడిస్తున్నారు. ఈ రవాణా అధికంగా కడప జిల్లాకు జరుగుతున్నట్లు సమాచారం. నెలకు 9వేల టన్నుల లాట్రైట్ ఖనిజాన్ని అక్రమంగా త్రవ్వి తరలించి వేస్తున్నారు. దీని విలువ 2.25 కోట్ల రూపాయలుగా తెలు స్తోంది. బహిరంగంగా లాట్రైట్‌ను అక్రమంగా తరలించి కోట్ల రూపాయలు గడిస్తున్నప్పటికీ సంబంధితశాఖకు చెందిన అధి కారులు మాత్రం తమకేమీ తెలియనట్లు వుండడం వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు సమాచారం. ఇప్పటి కైనా జిల్లా వున్నతాధికారులు జోక్యం చేసుకొని అక్రమ ఖనిజం తరలింపు జరగకుండా చూడాలని స్థానికులు కోరుకొంటు న్నారు.

తోటపల్లి గూడూరు పశువుల డాక్టర్ రూటే వేరు!

తోటపల్లి గూడూరు మండలం కోడూరు పశువైద్యాధికారి ప్రజలకు అందు బాటులో ఉండడం లేదు. కోడూరు గ్రామ పంచాయితీ పరిధిలో అనేక గ్రామాలు న్నాయి. పశువులకు వైద్యం చేయించేందుకు ఆసుపత్రికి వెళితే సిబ్బంది అందు బాటులో ఉండడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పశువైద్యాధికారి నెలకు 15 రోజులు విధులకు గైర్హాజరవుతున్నారు. ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి పునాదులు తీసిన కాంట్రాక్టర్ నేటివరకు పత్తాలేడు. తోటపల్లి గూడూరు, ఈదూరు కేంద్రాల్లో పశువైద్యులు అందుబాటులో ఉన్నా మేజర్ పంచాయితీగా ఉన్న కోడూరులో వైద్యుడు విధి నిర్వహణ పట్ల అలసత్వం చేస్తున్నాడు.

ఒళ్లు జాగ్రత్తగా పెట్టుకొని మసలుకోండి!

రౌడీషీటర్లకు గూడూరు డిఎస్పీ హెచ్చరిక

రౌడీ షీటర్లు తమ నడవడిక మార్చుకోవాలని లేని పక్షంలో జిల్లా బహిష్కరణ విధిస్తామని గూడూరు డిఎస్పీ సురేష్‌కుమార్ హెచ్చరించారు. ఎన్నికలను దృష్టిలో వుంచుకొని డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో రౌడీషీటర్లుగా నమోదైన వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న ఉప ఎన్నికలలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ రౌడీ షీటర్లు ఎలాంటి గొడవల్లో తలదూర్చరాదని హెచ్చరించారు. ఎక్కడైనా మీ పాత్ర వున్నట్లు తెలిస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. దౌర్జన్యాలు, దాడులకు, రౌడీయిజానికి పాల్పడితే ఉపేక్షించమని బహిష్కరణ వేటు వేయడానికి సిద్ధంగా వున్నామన్నారు. రౌడీషీటర్లుగా నమోదైన వారు సత్ప్రవర్తనతో మెలిగి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా జీవించాలన్నారు. అలాంటి వారిని గమనించి ప్రశాంతంగా బ్రతుకుతున్నారని తెలిస్తే వారిపై వున్న రౌడీ షీట్లు తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వాకాడు సిఐలు, గూడూరు రూరల్, పట్టణ ఎస్‌ఐలు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డ్‌గా
సూళ్లూరుపేట ఎమ్మార్వో ఆఫీసు!

సూళ్లూరుపేట తహశీల్దార్ కార్యాలయం డంపింగ్ యార్డుగా తయారవుతోంది. ఈ కార్యాలయ ప్రాంగణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, గృహ నిర్మాణశాఖ, సబ్‌ట్రెజరీ, మండల పరిషత్ కార్యాలయాలు వున్నాయి. ఈ ప్రాంగణం ప్రక్కనే వున్న దుకాణ యజమానులు చెత్తను ప్రాంగణంలో వేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డును తలపించే విధంగా దర్శనమిస్తుంది. ఈ విషయం ప్రాంగణంలో వున్న అన్ని శాఖల అధికారులకు తెలిసినా దుకాణాల యజమానులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. రాత్రి సమయంలో మందుబాబులు మద్యం సేవిస్తూ వాటర్ ప్యాకెట్లు, ఖాళీ బాటిళ్లను ఇక్కడే వదిలేసి వెళ్తున్నారు.

కల్వర్టుల వద్ద ప్రమాదాలు!

వెంకటగిరి - రాపూరు రోడ్డులో మామూలిది.

వెంకటగిరి – రాపూరు రోడ్డులోని మాధవయ్యపాళెం క్రాస్ రోడ్డు వద్ద నున్న కల్వర్టు వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తెలుగుగంగ కాలువ మధ్యనున్న ఈ కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల రాపూరు నుంచి వెంకటగిరికి వస్తున్న బియ్యం లారీ ఇదే కల్వర్టు వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్లు స్వల్పగాయాలతో బయటపడగా, దాదాపు 50 బియ్యం బస్తాలు నీటిలోపడి పనికి రాకుండాపోయాయి. ఇటువంటి ప్రమాదాలు వారంలో రెండు, మూడుసార్లు జరుగుతుంటాయి. ఇప్పటికైనా రోడ్లు, భవనాలశాఖాధికారులు స్పందించి ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాల్సిన అవసరం వుంది.

● ఆత్మకూరులో
మాస్ కాపీయింగ్

ఆత్మకూరులో జరిగిన ఓపెన్ యూనివర్శిటీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగింది. పట్టణంలో గల సామల రామయ్య – జానకమ్మ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ పరీక్షలు నిర్వహించారు. ఘుమారు రెండు వందల మంది పరీక్షలు వ్రాసిన ఈ కేంద్రంలో కళాశాల సిబ్బంది విద్యార్థులతో బేరం పెట్టుకొని మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించినట్లు సమాచారం. ఒక్కో విద్యార్థి వద్ద నుంచి వెయ్యి రూపాయలు వంతున వసూలు చేశారట. విద్యార్థులు పుస్తకాలను బహిరంగంగా

ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు జరిగాయి ఇలా!

టేబుల్ మీద పెట్టుకొని పరీక్షలు వ్రాసేందుకు ఈ మొత్తం తీసుకొన్నట్లు తెలుస్తోంది. కొందరు విద్యార్థులు మాత్రం అంత మొత్తం ఎందుకని ప్రశ్నిస్తే ఇందులో కళాశాల కరస్పాండెంట్‌కు వాటా ఇవ్వాలని వారి పేరు చెప్పడమే కాక మీరు ఇష్టానుసారంగా పరీక్ష వ్రాయడానికి తగిన వాతావరణ కల్పించిన ఇన్విజిలేటర్లకు కొంత ఇవ్వాలని చెప్పడంతో ఈ వ్యవహారం పైగగ్గోలు రేగింది.

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

అల్లూరు కాంగ్రెస్ నేతల బుజ్జగింపు!

ప్రచారబాటలో అసమ్మతి నేతలు

ఉప ఎన్నికల నేపథ్యంలో అసమ్మతి నేతల బుజ్జగింపును ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అసమ్మతి నేతలతో సమావేశం నిర్వహించి ఉప ఎన్నికల్లో ఇబ్బంది లేకుండా చూసే బాధ్యతను వాకాటి నారాయణరెడ్డి తీసుకున్నారు. ఇందులో భాగంగా అల్లూరు, కావలి, బోగోలు, దగదర్తి మండలాలకు చెందిన నాయకులతో చర్చలు జరిపి ఒక్కతాటిపైకి తెచ్చారు. కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అంటే పడని మధుబాబు, డి.సి.ఎం.ఎస్ అధ్యక్షుడు తాళ్లూరు రమణయ్య నాయుడు, మేడా అశోక్‌రెడ్డితో వాకాటి విడివిడిగా చర్చించడం జరిగింది. ఎవరికి బలమున్న ప్రాంతాల్లో వాళ్లు పార్టీకి ఓట్లుపడేలా కృషి చేయాలి. ఈ సర్దుబాటుకు అందరూ ఒప్పుకొని కలసికట్టుగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేసినట్లు తెలిసింది.

గ్యాస్‌సిలిండర్ల అక్రమ వాడకం!

గృహ అవసరాలకు వినియోగించాల్సిన వంటగ్యాస్ సిలిండర్లను కొందరు వ్యాపార అవసరాలకు వాడుతున్నారు. వెంకటగిరి, సూళ్లూరుపేట పట్టణంలో హోటళ్లు, స్వీట్‌స్టాల్స్, చికెన్ పకోడ దుకాణాలలో సబ్సిడీ సిలిండర్లను వినియోగిస్తున్నారు. దీంతో ఇంటి అవసరాలకు సబ్సిడీ ఇచ్చే సిలిండర్లు బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ విషయం సంబంధితశాఖ అధికారులకు తెలిసి ఇటీవల దుకాణాలపై దాడులు నిర్వహించి దాదాపు 10 సిలిండర్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ దాడుల్లో పౌరసరఫరాలశాఖ అధికారి యలమందరావు, నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట డిప్యూటి తహశీల్దార్లు పాల్గొన్నారు.

శ్రీ సిటి సెజ్‌లో కార్మిక చట్టం అమలు చేయాలి

తడ మండలంలోని శ్రీసిటి సెజ్‌లో దాదాపు 35 పరిశ్రమలు వుండగా కార్మిక చట్టాన్ని అమలు చేయడం లేదని సిఐటియూ అధ్యక్షుడు పద్మనాభయ్య ఆరోపించారు. సూళ్లూరుపేట సిపిఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీసిటి సెజ్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి రైతుల నుంచి భూములు తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. కేవలం కాంట్రాక్టు ప్రాతిపదికన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అలాగే సూళ్లూరుపేట మునిసిపాల్టీలో పారిశుద్ధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు.

● పశువైద్యశాలకు
సిబ్బంది కొరత!

ముత్తుకూరు మండలం పంటపాళెం గ్రామ పంచాయితీ పశు వైద్యశాలకు సిబ్బంది కొరత ఏర్పడింది. ప్రతిరోజు నిర్ణీత సమయానికి పశు వైద్యశాల తీయకపోవడంతో రైతులు తమ పశువులకు వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. గత కొద్ది సంవత్సరాల నుంచి క్రింది స్థాయి అధికారి ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ పశువైద్యాధికారి లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురౌతున్నాయని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి రెగ్యులర్ పశువైద్యాధికారిని నియమించాల్సిన అవసరం ఉంది.

పంటపాళెం పశువైద్యశాల పరిస్థితిది

● కదలని
గూడూరు పెద్దాస్పత్రి అంబులెన్స్!

ఇబ్బంది పడుతున్న పేదలు

అసలే వైద్యసేవలు అంతంతమాత్రంగా అందే గూడూరు ఏరియా హాస్పిటల్‌లో అంబులెన్సు రోగులకు అందుబాటులో లేకుండా పోతోంది. అత్యవసర వేళల్లో మెరుగైన చికిత్స కోసం వేరే ప్రాంతానికి తరలించడానికి ఇక్కడ అంబులెన్సును ఏర్పాటు చేశారు. వాహనం తరచూ మరమ్మత్తులకు గురవుతుండడంతో దీని స్థానంలో కొత్తది కొన్నారు. వాహనం మారినప్పటికీ సిబ్బందిలో మార్పురాలేదు. వైద్య చికిత్సల కోసం డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి ఆస్పత్రికి అధికసంఖ్యలో రోగులు వస్తుంటారు. కొన్ని సమయాల్లో నెల్లూరు, చెన్నైలకు తీసుకొని పోవాల్సిన సందర్భాలు ఎదురైనప్పుడు అంబులెన్సు రిపేరులో వుందని సమాధానం చెప్తుంటారు. ఎప్పుడు అడిగినా ఒకే సమాధానం రావడంతో పేద ప్రజలు మెరుగైన చికిత్సకోసం తమ వారిని తీసుకెళ్లాలంటే ప్రైవేట్ అంబులెన్స్ ఖర్చు భరించలేక అల్లాడిపోతున్నారు. అంబులెన్సు డ్రైవర్ నెల్లూరు నుంచి రాకపోకలు సాగిస్తుంటాడట. ఎప్పుడో చుట్టపు చూపుగా వచ్చి పోతున్నా అతన్ని అడిగేవారే లేకపోవడంతో ఇష్టారాజ్యం అయ్యింది. ఆస్పత్రి సిబ్బంది కావాలని అంబులెన్సు ఏర్పాటు చేయకుండా ప్రైవేట్ అంబులెన్సును పిలిపించి వారి వద్ద నుంచి కమీషన్ తీసుకొంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు గూడూరు ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించేలా చూడడంతోపాటు అంబులెన్సు ప్రజలకు అందుబాటులో వుండేలా చూడాల్సి వుంది.

సుజుగుడు

* నెల్లూరు డాక్టర్లలో యాక్టర్లెందరు?

పొగతోటలో షుగర్ వ్యాధి నిపుణురాలిగా చాలాకాలం నుంచి వందలాది మంది రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ మీనాక్షి సుందరి అసలు డాక్టర్ కాదు పొమ్మని తీర్మానించింది – ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కౌన్సిల్. రాష్ట్రంలో డాక్టర్లకు సంబంధించిన చట్టబద్ధమైన సంస్థ ఇది. ఎవరు డాక్టర్‌గా ప్రాక్టీస్ చేయాలన్నా ఇందులో తమ పేరు నమోదు చేసుకోవాలి. డాక్టర్లందరూ వృత్తిపరమైన నైతిక ప్రమాణాలు పాటించేట్లు చూడడం ఈ సంస్థ బాధ్యత. కట్టుబాటు తప్పిన వారిని వైద్య వృత్తి నుంచి బహిష్కరించే అధికారం వీరికి వుంది.

మీనాక్షి సుందరి చదివింది బయో కెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు మాత్రమే. కానీ ఆమె తన పేరు పక్కన "ఎండి" అనే తోక తగిలించింది. షుగర్ వ్యాధి నిపుణురాలిగా, ఎండోక్రైనాలజిస్ట్‌గా ప్రకటించుకొన్నది. దానితో కొన్ని వందల మంది ఆమె వద్ద డయాబెటిక్ సమస్యలకు చికిత్స పొందుతున్నారు. వచ్చిన వారికి ఆమె బెరకు గిరుకు లేకుండా మందులు వ్రాసిస్తున్నారు. థైరాయిడ్ వంటి క్లిష్టమైన రోగాలకు కూడా చికిత్స చేసి పారేస్తున్నారు. ఎంతోకాలంగా నడుస్తున్నదీ దగా. అయితే మాగుంట లేఅవుట్‌లో నివసించే కొండా రెడ్డి అనే పెద్ద మనిషి కూడా ఇదే విధంగా పొరపాటు పడి తన కుమార్తెకు థైరాయిడ్ చికిత్స చేయించాడట మీనాక్షి సుందరి వద్ద. దాని వల్ల కొత్త వైద్య సమస్యలొచ్చాయి. ఇదేమిటని విచారిస్తే, అసలామె డాక్టరే కాదని తేలింది. దానిపై మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశాడాయన. వారు సమగ్ర విచారణ జరిపిన తర్వాత నిజం నిగ్గు తేల్చి, డాక్టర్ కాదు పొమ్మని తేల్చారు.

మీనాక్షి సుందరి, డాక్టర్ల కుటుంబానికి చెందిన యువతి. ఆమె తండ్రి పాతకాలం నుంచి ప్రసిద్ధ డాక్టర్. భర్త కూడా డాక్టరే. అందువల్ల ఆమె అమాయక రోగులను సులభంగా మోసగించగల్గింది. అంత పెద్ద కుటుంబలో నుంచి వచ్చిన ఆమెకు అంత లేకి బుద్ధులెందుకు ఇచ్చాడో దేముడు?

ఇంతకూ మన పొగతోటలో ఇటువంటి మీనాక్షి సుందరులు ఇంకెంత మంది వున్నారన్నది ప్రశ్న. ఆ నాలుగైదు వీధులను డాక్టర్ల సూపర్ మార్కెట్‌గా చెప్పుకోవచ్చు. ప్రతి రెండో ఇళ్లు ఒక క్లినిక్ లేదా లాబొరేటరీ. దాదాపు రెండు వందల మంది వరకు వుంటారేమో డాక్టర్లు. వైద్యుడ్ని నారాయణుడితో సమానంగా చూడమంటారు మన పెద్దలు. కానీ పొగతోట వైద్యులను చూస్తే మాత్రం, నా మటుకు నాకు, యముడు పంపించిన కింకరుల వలె కన్పిస్తారు. జనాభా పెరిగిపోయి, నరక లోకంలో ఖాళీ లేక, పాపులను అక్కడ వరకు తీసుక వెళ్లడం ఎందుకని, ఇక్కడకే కింకరులను పంపి పాపులకు శిక్ష వేస్తున్నాడేమో యముడు అన్పిస్తున్నది. పురుషులలో పుణ్య

డోలేంద్ర

పురుషులున్నట్లు డాక్టర్లలోనూ కొందరు మనుషులు లేరని నేను చెప్పను. కానీ యమకింకరుల మధ్యలో వారి సంఖ్య వడ్ల మూటలో బియ్యం గింజలంత మాత్రమే.

రోగులతో నెల్లూరు డాక్టర్లు ఆడే వికృత క్రీడలు అన్నీ ఇన్నీ కావు. తమ దగ్గరకు రోగి రావడం ఆలస్యం – అతడి జేబుతో పాటు ఇళ్లు ఒళ్లు కూడా గుల్ల చేసిందాకా వదలి పెట్టరు. ఏవేవో పరీక్షలు. వాటన్నిటికీ లాబొరేటరీల నుంచి కమీషన్లు. రకరకాల స్కాన్‌లు. వాటన్నిటికీ వేలలో ఫీజులు. లండన్ మహా నగరం మొత్తం మీద ఎంఆర్ఐ స్కాన్ యంత్రాలు పది పన్నెండు లోపు వుంటాయట. కానీ ఒక్క నెల్లూరు నగరంలో ఈ స్కానింగ్ సెంటర్లు ఎన్ని వుంటాయో లెక్క పెట్టలేము. దాన్నిబట్టే రోగ నిర్ధారణ విషయంలో మన డాక్టర్లు అనుసరిస్తున్న వ్యాపార ధోరణి అర్థం చేసుకోవచ్చు. మందుల విషయంలో మహా ఘోరాలు. ప్రతి డాక్టరుకూ తన క్లినిక్‌లోనే ఒక మందుల షాపు వుంటుంది. రోగులు అందులోనే కొనాలి. రోగం ఏదైనా తమ మందులంగడిలో వున్న మందులే వ్రాస్తాడు డాక్టరు. ఆ మందులలో సగం నకిలీవి లేదా చవకబారు కంపెనీలవి. రోగానికి కావలసిన మందు ఒకటైతే, దానికి అదనంగా కనీసం అరడజను మందులు వ్రాస్తారు. కేవలం డబ్బు కోసం రోగి శరీరంతో చేసే వ్యాపారం అది. వాటివల్ల ప్రాణ హాని లేకపోవచ్చు కానీ, వేలాది రూపాయల వృధా ఖర్చు. రోగ నిర్ధారణ చేసే తీరిక ఏ డాక్టరుకూ వుండడం లేదు. గదిలోకి వచ్చే రోగులను త్వరత్వరగా పంపించకపోతే, బయట వేచి వున్న వారు వెళ్లిపోతారేమో అనే భయం. దానితో అవసరానికి మించి యాంటిబయోటిక్ మందులిచ్చి, ఏదో ఒక దానికి రోగం తగ్గకపోదు లెమ్మనే ధైర్యంతో పంపించి వేస్తున్నారు. ఆ అనాగరిక వైద్యం వల్ల రోగుల శరీరాలు యాంటిబయోటిక్ రెసిస్టెన్స్‌కు గురౌతున్నాయి. ఆరోగ్యం శాశ్వతంగా చెడి పోతున్నది. పొగతోట డాక్టర్లలో చాలా మంది చివరి నిముషం వరకు రోగిని తమ దగ్గరే అట్టి పెట్టుకొంటారు. చావు దగ్గర పడిన సమయం వరకు అంతా బాగుందనే చెప్తారు. ఆ

కొరవ 14వ పేజీలో

అవకాశమిస్తే జిల్లాకు 50వేల కోట్లు!



తిక్కవరపు సుబ్బరామిరెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న చందన వెంకటరమణ.

నెల్లూరుజిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలన్నది నా ఆకాంక్ష. పారిశ్రామికంగా ఇంతకాలం జరిగిన నిర్లక్ష్యాన్ని పూరించాలంటే కనీసం 50వేల కోట్ల రూపాయలు కావాలి. అంతే మేర ప్రైవేటు, ప్రభుత్వ రంగాల నుంచి నిధులు సేకరించి, నెల్లూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నా వంతు సేవ చేయాలన్న పట్టుదల వుంది... అన్నారు నెల్లూరు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి గారు. ట్రంకురోడ్డులోని సిఎంఆర్ షాపింగ్ మాల్‌లో జరిగిన పద్మశాలీయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దానం, ధ్యానం, ధర్మ మనే గౌతమ బుద్ధిడి సూత్రాలే నా జీవితానికి స్ఫూర్తి. గత పదహారు సంవత్సరాలుగా ఎమ్పీగా పని చేస్తున్నాను. కన్నతల్లి వంటి నెల్లూరు రుణం తీర్చుకోవాలన్నదే నా లక్ష్యం. అంతకు మించి ఈ ఎన్నికలలో వచ్చే పదవి మీద నాకు మరే స్వార్థం లేదు అని ప్రకటించారు సుబ్బరామిరెడ్డి గారు. ఎన్నికల తర్వాత కేంద్ర జౌళిశాఖ మంత్రి ఆనందశర్మను నెల్లూరు తీసుకొని వచ్చి, పద్మశాలీయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారాయన. ఈ సందర్భంగా పద్మశాలీయులు తమ మద్దతును ఆయనకు ప్రకటించారు. పద్మశాలీయులంతా సుబ్బరామిరెడ్డి గెలుపు కోసం కష్టపడి పని చేయాలని, తద్వారా తమ కుల సంక్షేమానికి ఆయన సేవలు ఉపయోగించుకోవాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.గజపతిరావు, ప్రధాన కార్యదర్శి కెఎస్.చక్రధర్, టి.రామకృష్ణయ్య తదితర నాయకులు పిలుపునిచ్చారు.

నెల్లూరు మీద అభిమానంతో పోటీ!

నేను పదవి కోసం పాకులాడే వాడిని కాను. పదవి కోసమే అయితే ఈ ఎన్నికలలో పోటీ చేయవలసిన అవసరం లేదు. నేను ఇప్పటికే రాజ్యసభ సభ్యుడిని. దానికి ఇంకా రెండేళ్ల కాలపరిమితి వుంది. కానీ పుట్టి పెరిగిన నెల్లూరు మీద అభిమానంతో, నెల్లూరు ప్రజలకు చేతనైన సహాయం చేయాలనే ఆకాంక్షతో మాత్రమే ఈ ఎన్నికలలో పోటీ చేస్తున్నాను. రాజకీయ, ఆధ్యాత్మిక, వ్యాపార, పారిశ్రామిక, కళా, సినిమా, సేవా రంగాలలో ఎన్నో ఏళ్లుగా దేశ వ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. కేంద్ర మంత్రిత్వంతో సహా ఉన్నత పదవులు, రాష్ట్రపతి స్వర్ణ కమలంతో సహా ఉత్తమ సత్కారాలు, రాజీవ్ గాంధీ, సోనియాగాంధీలతో సాహచర్యంతో సహా మహోన్నత వ్యక్తులతో పరిచయ భాగ్యం పొందాను. అయితే ఎన్నిచేసినా నా జన్మభూమి అయిన నెల్లూరుకు నా సేవలు ఉపయోగించాలన్న కోరిక ఎంతో కాలం నుంచి వుంది. అందుకోసమే ఇప్పుడు మీ ముందుకు వచ్చాను... అన్నారు నెల్లూరు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి.



తిక్కవరపు సుబ్బరామిరెడ్డిని సన్మానిస్తున్న దొడ్ల డైరీ ఛైర్మన్ దొడ్ల శేషారెడ్డి.


20తేది నరసింహకొండ రోడ్డులోని దొడ్ల డైరీ ప్రాంగణంలో జరిగిన వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

నేను మాటలు చెప్పేవాడిని కాను. ఇచ్చిన హామీలు నెరవేర్చే దృఢ సంకల్పం, శక్తియుక్తులు వున్నంత మేరకే వాగ్దానాలు చేస్తాను. నేను చెప్పిన ప్రతి మాటా ఎట్లా నెరవేరుస్తానో విశాఖపట్నంలో ఎవరిని అడిగినా చెప్తారు... అన్నారాయన.

దొడ్ల డైరీ ఛైర్మన్ దొడ్ల శేషారెడ్డి సుబ్బరామిరెడ్డిని సత్కరించారు. జివికె తనయుడు గునుపాటి సంజయ్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, ఎఐసిసి కార్యదర్శి పొంగులేటి సుధాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సివి.శేషారెడ్డి, దొడ్ల డైరీ మేనేజింగ్ డైరెక్టర్ దొడ్ల సునీల్‌రెడ్డి, పలువురు పాడిరైతులు ఈ సభలో పాల్గొన్నారు.

ఆయన పాదం పెట్టిన చోటంతా పసిడి సిరి!

సుబ్బరామిరెడ్డి గారి గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. తెలుసు కోవాల్సింది చాలా ఎక్కువ. నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన ఇక్కడకు వచ్చినప్పటి నుంచి ఆయన గురించి పెద్దలు చెప్తున్న విశేషాలు వింటుంటే ఆశ్చర్యం కల్గుతున్నది. విశాఖ పట్నం, హైదరాబాద్ నగరాలలో ఆయన చేసిన ధర్మ కార్యాలు, దాన ధర్మాలు అబ్బురం కొల్పేస్థాయిలో వున్నాయి. అవన్నీ తెలుసు కాబట్టే, సుబ్బరామిరెడ్డి ఎక్కడ అడుగు పెడితే అక్కడంతా పసిడి సిరి తాండ విస్తుందని ప్రశంసించారు ప్రముఖ సినీ నటి వాణిశ్రీ. ఆమె మాట అక్షరాలా నిజమని విశాఖపట్నం నుంచి వందల సంఖ్యలో తరలి వచ్చి, నెల్లూరులో సుబ్బ రామిరెడ్డి గారి తరపున ప్రచారం చేస్తున్న భిన్న వర్గా లకు చెందిన ప్రముఖులు చెప్తున్న మాటలు విశదం చేస్తున్నాయి. విశాఖపట్నంలో గత నలభై ఏళ్లుగా ఆయన ప్రజలకు చేసిన ఉపకారాలు ఎన్నో విన్పి స్తున్నాయి. మసీదుల నిర్మాణం, చర్చ్‌ల నిర్మాణం, ఆలయాల నిర్మాణం, వందలాది గ్రామాలకు త్రాగు నీటి సౌకర్యం వంటివన్నీ చేసి వున్నాడాయన. మరొకప్రక్క ఆ నగరం అభివృద్ధిలో సుబ్బరామిరెడ్డి పాత్ర ప్రమేయం స్పష్టంగా కన్పిస్తున్నది. విశాఖ విమానాశ్రయం అంతర్జాతీయ స్థాయికి ఎదగడం కేవలం సుబ్బరామిరెడ్డి గారి కృషి వల్లనే జరిగింది. నేదురుమల్లి జనార్దనరెడ్డితో కలిసి విశాఖ షిప్ యార్డ్, బిహెచ్‌పివి పరిశ్రమలను పునరుద్ధరించారు. సంస్థలు, వ్యాపార వర్గాల సహకారంతో ఈ బృహత్ కార్యక్రమం పూర్తి చేయాలన్నది సుబ్బరామిరెడ్డి గారి లక్ష్యం. స్టీల్ ప్లాంట్, ఎన్‌టిపిసి, పోర్టు ట్రస్ట్, హెచ్‌పిసిఎల్, కోరమాండల్ ఫర్టిలైజర్స్, హిందు స్థాన్ షిప్ యార్డ్, నావల్ కేంద్రం వంటి సంస్థలు సుబ్బరామిరెడ్డి గారి ప్రతిపాదనకు సమ్మతి తెలి పాయి. ఆయా పరిశ్రమల ఆవరణంలో కొన్ని వేల ఎకరాల భూమి ఖాళీగా వుంది. దాన్నంతటినీ పచ్చటి చెట్లతో నింపితే విశాఖనగరం కాలుష్య కోరలలో నుంచి బయటపడి పోతుంది. రానున్న ఐదేళ్లలో ఈ లక్ష్యం సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాడు సుబ్బరామిరెడ్డి.



ప్రచారంలో భాగంగా ఓ చిన్నారిని ముద్దాడుతున్న టిఎస్ఆర్, నవ్వుతూ చూస్తున్న ఎమ్పీ లగడపాటి రాజగోపాల్.

పుట్టినగడ్డ రుణం తీర్చుకుంటాను!

ఆయన నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా ఎన్ని కైతే, ఈ జిల్లాకు కూడా అటువంటి అదృష్టం పడు తుందని ఆకాంక్షించాడు మాజీ ఎమ్మెల్యే సివి.శేషా రెడ్డి. జగదేవిపేటలో జరిగిన ఒక సభలో శేషారెడ్డి, ఆయన్ను ధర్మదాతగా అభివర్ణించాడు.

"జగదేవి పేట నా జన్మభూమి. ఆ గ్రామం లోని మహత్మమే నాకు ఎక్కడ లేని శక్తి ఇచ్చింది. నన్ను అంతర్జాతీయ స్థాయికి చేర్చింది. ఆ పుట్టిన గడ్డ రుణం తీర్చుకొనే అవకాశం నాకు ఇవ్వండి, నన్ను ఇక్కడ నుంచి ప్రజా ప్రతినిధిగా లోక్‌సభకు పంపితే, నెల్లూరులో ఇంతకాలం కొరతగా వున్న కోరికలన్నిటినీ తీరుస్తాను"... అని హామీ ఇచ్చారు



స్వగ్రామం జగదేవిపేటలో అల్లుడు గునుపాటి సంజయ్‌రెడ్డి, విజయవాడ ఎమ్పీ లగడపాటి రాజగోపాల్‌తో కలిసి ప్రచారం చేస్తున్న టిఎస్ఆర్.

దాదాపు మూతపడే స్థాయిలో వుండిన ఆ రెండు పరిశ్రమలకు ఇప్పుడు జీవకళ వచ్చింది. వేలాది మందికి ఉద్యోగ భద్రత లభించింది.

ఇటీవలనే ఆయన విశాఖపట్నంలో ఒక బృహత్ పథకం ప్రారంభించారు. పలు భారీ పరిశ్ర మల వల్ల ఆ నగరం కాలుష్య కాసారంగా మారిపో యింది. ఆ సమస్య నుంచి లక్షలాది మంది నగర ప్రజలను రక్షించాలంటే నగరాన్ని హరిత వనంగా మార్చడం ఒక్కటే మార్గం. అందుకోసం నగరం లోపల 40 లక్షల మొక్కలను నాటించే కార్యక్రమా నికి శ్రీకారం చుట్టారాయన. దాదాపు 600 కోట్ల రూపాయలు ఖర్చయ్యే ఈ పథకానికి ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ సహాయం ఆశించడం లేదు. కేవ లం నగరంలో వున్న భారీ పరిశ్రమలు స్వచ్ఛంద సుబ్బరామిరెడ్డి గారు ఈ సభలో. ధర్మం, దానం, ధ్యానం అనే మూడు సూత్రాల ఆధారంగా నా జీవితం నడుస్తున్నది. ఆ సుగుణాలలోని మంచి తనం చూసి నాకు ఓటు చేయండి అని అభ్యర్థించా రాయన. డబ్బు, ధనం శాశ్వతం కాదని, పేదల గుండె లలో చోటు సంపాదించడమే చిర కీర్తిని ఇస్తుందని; 500 సంవత్సరాలు విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన రాజులను ఓడించి విశాఖలో తాను గెలి చానని, దానికి తగినట్లు విశాఖను అభివృద్ధి చేసి చూపించానని చెప్పారాయన. అభివృద్ధి జరపా లంటే రాజకీయ వేదిక కావాలి. అందుకోసమే నేను పోటీ చేస్తున్నాను. పదవి కోసమే అయితే పోటీ అవసరం లేదు. నేను ఇప్పటికే రాజ్యసభ సభ్యుడిని. నెల్లూరు ప్రజలకు సేవ చేయడం కోసమే ఈ ఎన్నిక లలో పోటీ... అన్నారు సుబ్బరామరెడ్డి గారు.

రాజీవ్ గాంధీ మార్గమే ఆదర్శం

తాను రాజకీయాలలోకి రావడానికి స్వర్గీయ రాజీవ్‌గాంధీ ఇచ్చిన ప్రోత్సాహమే కారణమన్న నిజాన్ని వెల్లడించారు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి. రాజీవ్ వర్ధంతిని పురస్కరించుకొని నెల్లూరు పెద్దాస్పత్రి వద్ద జరిగిన నివాళి కార్యక్రమంలో పాల్గొన్నారాయన. భారతదేశాన్ని 21 శతాబ్దంలో అగ్ర రాజ్యంగా తీర్చిదిద్దాలని రాజీవ్‌గాంధీ ఎన్నో కలలు కన్నారు. అందుకు అనుగుణంగా ఎన్నో ప్రణాళికలు తయారు చేశారు. ఆయన అకాల మర ణం వల్ల దేశం ఎంతగానో నష్టపోయింది. ఆయన దూర దృష్టి, ముందు చూపుల వల్లనే ఈ రోజు మన దేశ ప్రజలకు మొబైల్ ఫోన్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, గ్రామీణ ప్రాంతాలకు సైతం ఇంటర్నెట్ సదుపాయం, ప్రజలందరికీ అందుబాటులో వాహ నాలు, వూరూరా ఇంజనీరింగ్ కాలేజీలు వంటి సౌకర్యాలు ఏర్పడ్డాయి. దేశాన్ని అభివృద్ధి చేయ డంలో రాజీవ్‌గాంధీ మార్గమే నాకు కూడా ఆద ర్శం.... అన్నారు సుబ్బరామిరెడ్డి గారు.

దృశ్య ప్రచార రథాలు

తిక్కవరపు సుబ్బరామిరెడ్డి గారు నెల్లూరు ఎన్నికల ప్రచారంలో ఒక కొత్త పోకడకు శ్రీకారం చుట్టారు. భారీ తెరతో కూడిన డిజిటల్ ప్రచార రథాలను గ్రామాలకు పంపుతున్నారాయన. దాదాపు సినిమా చూసినంత స్పష్టతతో సుబ్బరామిరెడ్డి గారు విశాఖపట్నంలో చేసిన సేవా కార్యక్రమాలను, నెల్లూ రులో జరిగిన మోహన్‌బాబు సత్కార సభలో వివిధ సినీ రంగ ప్రముఖులు ఆయన్ను ప్రశంసిస్తూ చేసిన ప్రసంగాలు, కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలను ఆ తెర మీద చూపుతున్నారు. అవి జనాన్ని బాగా ఆకర్షి స్తున్నాయి. చెప్పదలచుకొన్న సంఘటనలను దృశ్య రూపంలో మనసులకు హత్తుకొనేట్లు చెప్పడంలో టిఎస్ఆర్ సఫలీకృతుడౌతున్నాడు.

క్రైస్తవుల ప్రార్థనలు

నెల్లూరుకు చెందిన పలువురు క్రైస్తవ పాస్టర్లు, బిషప్ వంటి మత పెద్దలు నెల్లూరు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి విజ యాన్ని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు జరిపారు. జివికె అతిథి గృహం వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు స్వచ్ఛందంగా తరలివచ్చి, నిజ మైన సర్వ మత అభిమానిగా సుబ్బరామిరెడ్డి ఘన కీర్తిని ప్రస్తావిస్తూ మాట్లాడారు. సుబ్బరామిరెడ్డి గారు ఎంత భక్తితో శివారాధన చేస్తాడో, అంతే



రాజీవ్ వర్ధంతిని పురస్కరించుకొని స్మృత్యంజలిలో టిఎస్ఆర్.

అంకిత భావంతో ఇతర మతాలనూ ఆదరిస్తారు. విశాఖపట్నంలో ఆయన నిర్మించిన చర్చిలు, మసీదులే అందుకు రుజువు. ఆ నిజం తెలిసిన క్రైస్తవ మత పెద్దలు, తమ మతం క్షేమంకోరే సుబ్బరామిరెడ్డిని మనసారా ఆశీర్వదించారు. ఆయన గెలవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ ఎమ్పీ లగడ పాటి రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే, పిసిసి పరిశీల కుడు డాక్టర్ ఎస్ఎ.రహమాన్ పాల్గొన్నారు.

మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

తలపెట్టిన పనులు ఉత్సాహంతో పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపార రంగాలలోనివారికి సామాన్య ఫలితాలుంటాయి. ప్రయాణాలలో శ్రద్ధ వహించండి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలున్నాయి. వ్యవ సాయదారులు ఋణ, శత్రు బాధల నుండి విముక్తి పొందుతారు. కళా, క్రీడా రంగాలలోని వారికి గుర్తింపు, రాణింపు అంతగా వుం దదు. పై అధికారులతో ఏర్పడిన అభిప్రాయ భేదాలు తొలగుతాయి.

వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

పనులలో ఆటంకాలు లేనప్పటికీ సంయమనం పాటించడం అవ సరం. అధిక శ్రమ, ఆర్థిక నష్టాలేర్పడేందుకు అవకాశాలున్నాయి. విద్యార్థులు ఫలితాలు బాగున్నప్పటికీ తోటివారితో మసలునప్పుడు జాగ్రత్తలు పాటించాలి. కళా, క్రీడా రంగాలలోని వారు ఆర్థిక విష యాలలో మెళకువగా వుండాలి. రాజకీయ రంగంలోని వారు తమ రాజకీయ ప్రతిష్టకు భంగం కలగకుండా చూసుకోవాలి.

మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్రపునర్వసు,1,2,3 పా

ఈ రాశి వారు తలపెట్టిన పనులన్నీ పూర్తయి వ్యయానికి తగిన ఆదా యంతో స్థిరంగా వుంటారు. గతంలో చేసిన ఋణాలు తీర్చుకొం టారు. ఉద్యోగ, వ్యాపారాలలోని వారు గౌరవ, మన్ననలు పొందు తారు. విద్యార్థులకు బాగుంటుంది. వ్యవసాయదారులకు ఆదాయం వున్నా శ్రమ అధికంగా వుంటుంది. రాజకీయులకు పై వర్గాల అండ దండలుంటాయి. దూర ప్రయాణాలకు అనుకూలం కాదు.

కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

ఆర్థిక విషయాలు గతం కంటే మేలుగా వుంటాయి. కొన్ని ఇబ్బందులు దూరమవుతాయి. పై అధికారులతో మాట్లాడే సమయంలో వివా దాలు రాకుండా చూసుకొనేది. విద్యార్థులు మంచి ఫలితాలు పొంది ఉత్సాహంగా వుంటారు. వ్యవసాయదారులు గతంలో ఆగిపోయిన పనులు పూర్తిచేయగలరు. రాజకీయాలలోని వారు తమ తోటి వారి సహకారం పొందలేరు. ముఖ్య వ్యక్తులను దూరం చేసుకొంటారు.

సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

అనుకున్నంత ఆదాయం పొందలేరు. చేసే పనులు వాయిదాపడ టం లేదా అధిక శ్రమతో పూర్తి చేయడం జరుగుతుంది. ఉద్యోగు లకు మంచి కాలం. ప్రమోషన్లు, అనుకూల బదలీలు వుంటాయి. వ్యవసాయదారులకు అనుకూలంగా వున్నా శ్రమ, నష్టాలు తప్పవు. కళా, క్రీడా రంగాలలోని వారికి మనోవిచారం. రాజకీయ రంగం లోని వారు నూతన పనులు వాయిదా వేసుకోవడం మంచిది.

కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

తలపెట్టిన పనులలో ఫలితాలు మిశ్రమంగా వుంటాయి. బంధువుల తాకిడి అధికంగా వుంటుంది. అధిక ఖర్చులు, శ్రమ, ఒత్తిడి వుం టాయి. తొందరపాటుతో తప్పులు చేసే అవకాశం వుంది. విద్యార్థు లకు అత్యంత అనకూలమైన కాలం. వ్యవసాయదారులకు ఆర్థిక లాభాలుంటాయి. రాజకీయాలలోని వారికి పై వర్గాల తాకిడి, ఖర్చులు వుంటాయి. వీరికి శుభాశుభమిశ్రమంగా వుంటుంది.

వారఫలాలు

తేది 26-05-2012 నుండి 1-06-2012 వరకు వృషభంలో రవి, బుధ, గురు, శుక్ర, కేతువులు; సింహంలో కుజుడు; కన్యలో శని; వృశ్చికంలో రాహువు; మిథున, కర్కాటక, సింహ, కన్యలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

27తేది అరణ్యక షష్ఠి, వింధ్యావాసినీ దేవిపూజ.
28తేది వరుణ సప్తమి,
సా 04.57 ని॥ల నుండి కర్తరీ త్యాగం.
29తేది గురుమూఢమి త్యాగం, త్రిలోచనాష్టమి.
31తేది దశపాపహర దశమి.
1తేది శుక్రమూఢమి ప్రారంభం.

శుభ ముహూర్తాలు

26, 31తేదీలలో సీమంత, అన్నప్రాసనలకు సుముహూర్తాలున్నాయి. గురు, శుక్ర మూఢమిల కారణంగా వివాహాది శుభకార్యాలకు సుముహూర్తాలు లేవు.

మే తిథులు

జ్యేష్ఠ శుద్ధ

26	శని	పంచమి	ప	02.09 గం.ల.వ
27	ఆది	షష్ఠి	ప	02.28 గం.ల.వ
28	సోమ	సప్తమి	ప	02.09 గం.ల.వ
29	మంగళ	అష్టమి	ప	01.09 గం.ల.వ
30	బుధ	నవమి	ప	11.29 గం.ల.వ
31	గురు	దశమి	ప	09.17 గం.ల.వ

జూన్ తిథులు

1	శుక్ర	ఏకాదశి	ఉ	06.31 గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.

తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

ఇతరులతో మాట్లాడేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలి. ఇతర వ్యవహారాలలో హామీలుండకండి. విద్యార్థులు మంచి ఫలితాలు పొందగలరు. వ్యవసాయదారులు చేపట్టిన పనులన్నీ పూర్తి చేయ గలరు. కళా, క్రీడా రంగాలలోని వారికి గతంలో కన్నా మేలుగా వుంటుంది. రాజకీయాలలోని వారికి అకాల విరోధం, అనారోగ్యం వుంటుంది. కొన్ని సమస్యలలో పై వర్గాల ఒత్తిడి వుంటుంది.

వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

కొంత అనుకూలతలు, మానసిక ధైర్యం వుంటుంది. ఇంట్లో సుఖసం తోషాలుంటాయి. నిరుద్యోగులు నూతన అవకాశాలు పొందగలరు. విద్యార్థులకు బాగుంటుంది. వ్యవసాయదారులకు అనాలోచన వ్యవ హారాల వల్ల ఆర్థిక నష్టాలుంటాయి. కళా, క్రీడా రంగాల వారికి తమ జీవనోపాధిపై ఆసక్తి పెరుగుతుంది. రాజకీయాలలోని వారికి క్రింది వారి తీరు కొంత వ్యతిరేకంగా వున్నా చేపట్టిన పనులు పూర్తవుతాయి.

ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ఆదాయ, గౌరవాలు కొంత తగ్గుతాయి. చేపట్టే పనులు సకాలంలో పూర్తికాకపోవచ్చు. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలోని వారి నిత్యకృ త్యాలు యథావిధిగా సాగుతాయి. విద్యార్థులకు అన్నింటా సామాన్య అనుకూలతలు వున్నా, అన్య విషయాలపై ఆసక్తి పెరగడం వల్ల నష్టపోతారు. వ్యవసాయదారులు మంచి ఫలితాలు పొందగలరు. రాజకీయులు అన్ని వర్గాలతో సఖ్యత పాటించాలి.

మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

కొంత శ్రమతో పనులు పూర్తి చేస్తారు. అధిక శ్రమ, ఒత్తిడి వుం టుంది. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా విజయాలు సాధించగలరు. వ్యవసాయదారులకు ఆదాయం ఆశించినంతగా వుండదు. కళా, క్రీడా రంగాలలోని వారికి కొంత మానసికాందోళన వుంటుంది. రాజకీయ రంగంలోని వారికి పై వర్గాల ఒత్తిడి, శ్రమ వుంటుంది. రోజు వారీ పనులు ఆలస్యమౌతాయి.

కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

తలపెట్టిన పనులు కొంతవరకు జరగడం లేదా వాయిదా పడటం జరుగుతుంది. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. విద్యార్థుల మనోభీష్టాలు నెరవేరుతాయి. వ్యవసాయ రంగంలోని వారికి ఆర్థిక లాభాలుంటాయి. రాజకీయ రంగంలోని వారు తాము తలపెట్టిన పనులు సకాలంలో పూర్తి చేయగలరు. అగ్రిమెంట్ల వ్యవహారాలలో లిఖిత పూర్వకంగా వుండేటట్లు జాగ్రత్త పడటం మంచిది.

మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

గతవారం లాగానే అనుకూలమైన వారం. సకాలంలో అన్నీ పనులు పూర్తి చేయగల్గుతారు. అనుకున్నవి సాధించడానికి పట్టుదల అవ సరం. ఇతరుల వ్యవహారాలకు దూరంగా వుండండి. విద్యార్థులకు బాగుంటుంది. వ్యవసాయదారులు తమ స్వశక్తికి ప్రాధాన్యం ఇవ్వ డం మంచిది. కళా, క్రీడా రంగాలలోని వారికి వృత్తిపై అంకిత భావం అవసరం. రాజకీయ రంగంలోని వారికి అననుకూలం.

ఈశాన్యం వంట గది తగదు!

సి.వి.ఈశ్వరరెడ్డి *బిట్రగుంట*

** గృహం పూర్తయ్యి రెండేళ్లయింది. ఇప్పుడు అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడింది?*

అంత వాస్తుపైన నమ్మకం లేనివాళ్లు ఇప్పుడు వాస్తు కోసం ప్రాధేయపడడం ఎందుకు? ఈశా న్యంలో వంట గది పెట్టి ఎవరు మాత్రం బాగుపడ తారు?

పి.జగన్నాధ్ *తాడేపల్లిగూడెం*

** నేను మా ఊరిలో 'పిశాచవేధ'ను గురించి స్వయంగా చూశాను.*

'మంత్ర పుష్పక త్రయం'లో పిశాచ వేధో నివారణ మార్గాలున్నాయి. ప్రయత్నించండి. లేని పక్షంలో గృహాన్ని వదిలివేయడం మంచిది.

పి.వి.ఆర్ *చెన్నై*

** మా కోడలి ప్రభావం గృహం మీద చాలా ఉంది. నరకమై పోతూ ఉంది?*

గృహంలో ఉత్తర, దక్షిణ దోషాలు స్త్రీలపైనే పనిచేస్తాయి. మంచి, చెడులు ఇద్దరిలోనూ ఉండ వచ్చు. అందువల్లే స్త్రీకి స్త్రీయే శత్రువన్నారు. ఆమె నొకసారి మానసిక వైద్యుడికి చూపించండి.

ఎం.రంగరాజశ్రేష్ఠి *చెన్నై*

** 'పిశాచవేధ'లో యంత్రాలు పని చేయవా?*

'పిశాచవేధ'ను గురించి వివరణ "శైవబలి నిధానం"లో ఉన్నది. వాటికి 'సుదర్శన యంత్రం' బాగా పనిచేస్తుంది. అయితే హత్యానంతర 'పిశాచ' రూపం, శక్తి ఆవాహనను పొందితే ఏ మంత్రశక్తి ఆ శక్తిని ఎదుర్కొనలేదు.

దివ్వెన శ్రీకాంత్ *బెంగుళూరు*

** గృహం శ్లాబులు పడ్డాక నిర్మాణంలో జాప్యం వల్ల పని ఆగిపోయింది.*

హనుమాన్ యంత్రం ప్రతిష్ఠించి నిత్యం ఆయా విభాగాలలో దీపం వెలిగేలా చూడండి.

సి.వి.ఎన్ *గూడూరు*

** గృహం తగలబడి ఆమె మరణించింది. అప్పటి నుంచే మాకీ కష్టాలు ప్రారంభమయ్యాయి.*

అసహజ మరణమే 'పిశాచరూప' ఆవిర్భావా నికి కారణమవుతున్నది. మీ ప్రహరీ స్థలంలో 'కుంభ' ప్రతిష్ఠ చేయండి. అప్పటికీ ఫలితం లేక పోతే హంతకురాలికి 'కీడు' జరుగవచ్చు.

పెండేటి వేంకటసుబ్బయ్య *కడప*

** వాస్తు జ్యోతిష్య నివారణ కార్యక్రమాలన్నీ చేయించాను. అయినా ఫలితం ఉండటం లేదు.*

నిష్ణాతులైన శాస్త్రజ్ఞులే నివారణలు చేయ గలరు. చెడు జరుగుతుంది కాబట్టి మరొకరిని సం ప్రదించండి. మీ యింటి ప్రహరీలోని జిల్లేడు, చింత చెట్లను వెంటనే నిర్మూలించండి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

సి.ప్రభాకర్‌రెడ్డి *చింతకుంట*

** గృహ నిర్మాణ సమయంలో పై నుంచి పడిన స్త్రీరూపం ఆ ప్రాంతాలలో కనిపిస్తున్నది.*

అలాగని ప్రచారం చేయకండి. 'మంత్ర త్రయీ' విధానం వల్ల పిశాచవేధను తొలగించ వచ్చు. సుదర్శన యంత్ర ప్రతిష్ఠ చేసుకోండి.

కె.ఎం.ఆర్ *ఆత్మకూరు*

** ఆమె అసహజ మరణం తర్వాత 'గృహస్థురాలు' మానసిక అనారోగ్యంపాలై మర ణించిందెందు వల్ల?*

భారతీయ వాస్తు 'ఆత్మ' సిద్ధాంతాన్ని అగస్త్య, విశ్వామిత్ర, శ్రీకృష్ణవాస్తు శాస్త్రాలలో అంగీకరిం చింది. గృహం శిథిలమై అది ఆవాసయోగ్యం కాక పోవడం వల్ల 'ఆత్మ' మరింత శక్తివంతమై ప్రతీ కారం తీర్చుకొని ఉంటుంది.

కె.వి.రమణ *రాయచూరు*

** అబ్బాయి మానసిక ఎదుగుదలకు, వాస్తుకూ సంబంధం ఉందా?*


తూర్పు, పశ్చిమ దిశా, కోణ వేధలు, భ్రష్ట తలు పిల్లల మానసిక పరిస్థితిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

వై.శశికాంత్ *చెన్నై*

** అపార్టుమెంటులో ఫ్లాటు వాయువ్యం పెరిగింది. మానసికంగా కుమిలి పోతున్నాము.*

జరిగిందేదో జరిగిపోయింది. మీ దంపతుల జన్మతేదీలు పంపండి 'యంత్రం' నిర్ధారిస్తాను.

సంస్మరణ



జననం
21-09-1918

మరణం
29-05-1997

శ్రీ గునుపాటి రామచంద్రారెడ్డి గారు

మాజీ శాసనమండలి సభ్యులు

పరమపదించి 29-05-2012 నాటికి పదిహేను సంవత్సరాలు పూర్తవుతాయి.

15వ వర్ధంతి

సందర్భంగా వారి పవిత్రాత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుటుంబసభ్యులు

ఐటెమ్‌పాటలకు సదా... సై!



హీరోయిన్ సదా జయం చిత్రంతో తెలుగు తెరకు పరిచయమయ్యింది. ఆ తర్వాత తెలుగులో దొంగ దొంగది, వీరభద్ర, ప్రాణం చిత్రాల్లో నటించింది. ఆమె కెరీర్‌లో పెద్ద విజయం అపరిచితుడు. ఆతర్వాత కూడా సదా నెగ్గుకు రాలేకపోయింది. తెలుగుతోపాటు తమిళ, కన్నడ, హిందీ భాషల్లో నటించిన సదా ఇప్పుడు రూటు మార్చింది. ఐటమ్‌గాళ్‌గా కెమెరా ముందుకు వచ్చేందుకు అంగీకారం తెలిపింది. విశాల్ కథానాయకుడిగా 'మద గజరాజ' అనే తమిళచిత్రం రూపొందుతోంది. సుందర్. సి.దర్శకత్వం వహిస్తారు. దీనిలో సదా ఓ ఐటెమ్ పాటలో నర్తిస్తుంది. ఈ చిత్రాన్ని తెలుగులోనూ డబ్ చేస్తారు. ఈ సినిమాలో విశాల్ సరసన కార్తీక హీరోయిన్‌గా నటిస్తుంది.

బోయపాటికి చరణ్ ఛాన్స్!




భద్ర నుంచి దమ్ము వరకూ మాస్ యాక్షన్ సినిమాలతో తనకంటూ ఓ శైలిని చూపిస్తున్న దర్శకుడు బోయపాటి శ్రీను. త్వరలో ఈయన రామ్‌చరణ్ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. దుర్గా ఆర్ట్స్ సంస్థ ఈ సినిమాన్ని నిర్మిస్తుంది. డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మాత. జంజీర్, వి.వి.వినాయక్, వంశీ, పైడితల్లి దర్శకత్వంలో తయారయ్యే చిత్రాలు పూర్తయ్యాక బోయపాటి చిత్రం సెట్స్ మీదకెళ్తుంది.

ప్రియుడి గుర్తులు చెరిపేస్తుంది!



దీపికా పదుకొణెకు ముంబైలోని ప్రభాదేవి ప్రాంతంలో ఓ ఫ్లాట్ వుంది. ఈ ఫ్లాట్ డెకరేషన్‌కు ఆరోజుల్లో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడంతో వార్తల్లో నిలిచింది. దీన్ని దీపికా బాయ్‌ఫ్రెండ్ సిద్దార్థ్ మాల్యా బహుమతిగా ఇచ్చాడని బాలీవుడ్‌లో ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని ఆ ప్రేమికులు ఖండించనూ లేదు. అంగీకరించనూ లేదు. ఇప్పుడు వారి ప్రేమసౌధానికి బీటలు పడ్డాయి. ఇద్దరూ విడిపోయారు. ఈ క్రమంలో దీపిక ఆ ఫ్లాట్‌ను అమ్మేయాలని భావించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సమాచారం అందించిదట. దీన్ని అమ్మివేసాక ఆమె తన కుటుంబంతోనే వుంటుందట.

మళ్లీ సుశాంత్



అక్కినేని నాగేశ్వరరావు కుమార్తె నాగసుశీల కుమారుడు సుశాంత్ హీరోగా ఇప్పటివరకు కాళిదాస్, కరెంట్ చిత్రాల్లో నటించారు. కొన్నాళ్లు నటనకు దూరంగా వుండిన ఆయన మూడో చిత్రంలో నటించను సిద్ధమయ్యారు. ఈ సినిమాకు అడ్డాగా పేరు ఖరారు చేశారు. సాయిరెడ్డి దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఇందులో సుశాంత్ సరసన శాన్వి నాయికగా నటించబోతుంది. ఈ భామ ఇటీవల విడుదలైన 'లవ్‌లీ' చిత్రంలో నటించింది. అడ్డాను పక్కా మాస్ ఎంటర్ టైనర్‌గా మలుస్తున్నట్లు దర్శకుడు చెప్పారు.


మంచు మనోజ్ ఫైట్స్!



హీరో మంచు మనోజ్‌కు ఫైట్స్ అంటే మహా ఇష్టం. అందుకే ఆయన విదేశీ పోరాట నిపుణుల దగ్గర శిక్షణ కూడా పొందారు. వేదం, బిందాస్, మిస్టర్ నూకయ్య చిత్రాలకు స్వయంగా యాక్షన్ ఘట్టాలను కంపోజ్ చేసుకొన్న మనోజ్ నందమూరి బాలకృష్ణ హీరోగా నటించే 'ఊ కొడతారా ఉలికిపడతారా? చిత్రానికి కూడా ఫైట్స్ సమకూర్చారు. ఈ చిత్రాన్ని మంచు మనోజ్ సోదరి లక్ష్మీప్రసన్న నిర్మిస్తున్నారు. కేరళలో ఇటీవల ఈ చిత్రం షూటింగ్ జరగ్గా మనోజ్ పోరాట సన్నివేశాలు చిత్రీకరించాడు.


ట్రంకు రోడ్డు రాజకీయాలు

పాపం... బాబు



సుదీర్ఘకాలం రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన ట్రాక్ రికార్డు వున్న వ్యక్తి, హైటెక్ నేతగా దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకొన్న నారా చంద్రబాబు నాయుడు పుట్టెడు కష్టాలను ఎదుర్కొంటున్న విషయం ఆయన నెల్లూరు పర్యటనలో కళ్లకు కట్టినట్లు కనపడింది. గతంలో చంద్రబాబు జిల్లా పర్యటనకు వస్తే ముఖ్యమంత్రులను మించిన ఆర్భాటం వుండేది. ఈసారి పర్యటనకు వచ్చినబాబు నగరంలోని ఓ త్రీస్టార్ హోటల్‌లో బస చేశారు. రెండురోజుల పాటు జరిపిన నెల్లూరు రూరల్, సిటీ నియోజకవర్గాల కార్యకర్తల సమావేశం కేవలం 200 మంది పట్టే పార్టీ కార్యాలయంలోనే పెట్టారు. పై అంతస్తులేని ఈ కార్యాలయంలో చమటలు కక్కుతూనే బాబు రెండు రోజులు ఉపన్యాసాలు దంచారు. ఎండ తగ్గాకనే రోడ్డు షోలు చేశారు. జగన్మోహన్‌రెడ్డి స్ఫూర్తితో కాబోలు ఆత్మీయులను కోల్పోయిన ఇద్దరు పార్టీ ముఖ్య కార్యకర్తలను ఇంటికి వెళ్లి ఓదార్చారు. సాధారణ ట్రాఫిక్‌లో నగరంలో తిరుగుతుండిన బాబు కాన్వాయ్ గూర్చి జనం చర్చించుకోవడం కనిపించింది.

ఓటు వేయమని ప్రభుత్వ ప్రచారం!



ఎన్నికల్లో ఓటు వేయమని రాజకీయ పార్టీలు ఓటర్లను అభ్యర్థిస్తాయి. వారిని ఆకర్షించను ఫ్లెక్సీలు, కరపత్రాలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాయి. అయితే పైన పేర్కొన్నట్లు పార్టీలు ప్రచారం చేస్తే ఎన్నికల కోడ్ ప్రకారం పరిమితి విధించిన ఖర్చు దాటిపోతుంది. పార్టీలకు బదులుగా ఓటు వేయమని కలెక్టర్ పేరిట జిల్లా అంతటా పెద్ద పెద్ద ఫ్లెక్సీలు పెట్టారు. ఓటు విలువ తెలియజేసేలా కరపత్రాలు పంచుతున్నారు. మేధావులు, అధికారులు, విద్యార్థులతే 5కె, 2కె రన్లు నిర్వహించను ప్రణాళిక సిద్ధం చేశారు. కళాజాతాలు నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గమంతా తిరిగేలా రూట్ మ్యాప్ తయారయ్యింది. రాష్ట్రంలో ఉపఎన్నికలు జరుగుతున్న నియోజకవర్గాలలోనూ ఈ తరహా ప్రచారం చేపట్టమని కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ ఆదేశించడంతో పాటు కొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టిన నెల్లూరు కలెక్టర్ శ్రీధర్‌రెడ్డిని అభినందించారు.

కొత్త స్నేహితులు




గత రెండు దఫాలుగా సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కత్తులు దూసుకొన్న ప్రత్యర్థులు ఆదాల ప్రభాకర్ రెడ్డి, సివి.శేషారెడ్డి ఇప్పుడు మంచి మిత్రులైపోయారు. కాంగ్రెస్‌ను వదలి ప్రజారాజ్యంలోకి పోయి అక్కడ నుంచి తిరిగి వచ్చేసిన సివి. శేషారెడ్డి ఇటీవల ఆదాల ప్రభాకర్ రెడ్డిని అంటి పెట్టుకొని తిరుగుతున్నారు. ఆయనతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆత్మకూరు, వింజమూరుల్లో ముఖ్యమంత్రి పాల్గొన్న బహిరంగ సభలకు వీరు ఒకే కారులో వచ్చి వెళ్లడం చూసి జనం విస్తుపోయారు. ఇదేమి రాజకీయమని వ్యాఖ్యానించడం వినిపించింది.

రెండు కళ్ల సిద్ధాంతం వద్దు!



నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రా – తెలంగాణ ప్రాంతాలు తనకు రెండు కళ్ల వంటివని చెప్పిన సిద్ధాంతం బాగా వివాదాస్పదమయ్యింది. నెల్లూరు పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డి ఎన్నికల ప్రచారసభలో తనకు విశాఖపట్నం – నెల్లూరు రెండు కళ్లని చెబుతున్నారు. సిఎం పాల్గొన్న ఆత్మకూరు, వింజమూరు సభల్లో టిఎస్ఆర్ ఈ మాట చెప్పడాన్ని కిరణ్‌కుమార్‌రెడ్డి ఒప్పుకోలేదు. సుబ్బరామిరెడ్డి గారూ రెండు కళ్ల సిద్ధాంతం మానండి. నెల్లూరే ఇక మీకు రెండు కళ్లని చెప్పండని చమత్కరించడం అందరిలో చర్చనీయాంశమయ్యింది.

ఎందుకలా?



ఒక్కోసారి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తెలియని అక్కసు ప్రదర్శిస్తారని ఆయనను బాగా ఎరిగినవారు చెబుతుంటారు. అక్కసుతో వచ్చే ఆక్రోశంతో ఆయన వింతగా ప్రవర్తించడం చర్చనీయాంశమయ్యింది. ఆత్మకూరులో సిఎం పర్యటన సందర్భంగా స్థానిక నాయకులు వివేకాను స్టేజిపైకి ఆహ్వానించి ముందు వరుసలో కూర్చోబెట్టారు. తొలి వక్తగా ఆయన పేరు కార్యక్రమ సరళిలో వుండింది. ఏం జరిగిందో ఏమో సిఎం వచ్చేసరికి ఆయన వేదిక దిగి జనంలోకి వెళ్లి కూర్చున్నారు. మైకులో పదే పదే పిలిచినా రాకపోయేసరికి ఆయన తమ్ముడు ఆర్థికమంత్రి రామనారాయణరెడ్డి మైకందుకొని మాట్లాడడం మొదలు పెట్టి ఈ వ్యవహారంలో అనుమానాలు పెద్దవి కాకుండా చూశారు.



బాలాజీనగర్ మసీదులో దువా చేస్తున్న హాజీ అబ్దుల్ అజీజ్, వెంకటరమణారెడ్డి.

మేకపాటి విజయం కోసం నమాజ్!


నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షిస్తూ 18వ తేది బాలాజీనగర్‌లోని మసీదు వద్ద శుక్రవారం నమాజు అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలో వైకాపా నాయకులు హాజీ అబ్దుల్ అజీజ్, ఆనం వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం అబ్దుల్ అజీజ్ ముస్లిం సమూహాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా ముస్లింలు కాంగ్రెస్‌ను గుడ్డిగా నమ్ముకుంటే ఆ పార్టీ ముస్లింలకు మొండిచేయి చూపించింది. దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్ల మూలంగా చిన్న చిన్న చేతివృత్తులు చేసుకొనే పేద కుటుంబాల బిడ్డలు సైతం నేడు డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారు. రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన పథకాలు కొనసాగాలన్నా, ముస్లింలకు మేలు జరగాలన్నా అది ఒక్క జగన్మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గయాజ్, వహీద్, అబ్దుల్ జలీల్, కమల్, హాజీ రఫీ, కర్తం ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరామిరెడ్డి విజయం తథ్యం!

ఎఐసిసి కార్యదర్శి పొంగులేటి

నెల్లూరు పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డి విజయం సాధించడం తథ్యమని ఏఐసిసి కార్యదర్శి పొంగులేటి సుధాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఇందిరాభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిఎస్ఆర్ మిస్టర్ క్లీన్‌గా పేరుతెచ్చుకొన్న వ్యక్తని కితాబిచ్చారు. వైజాగ్‌ను ఎంతో అభివృద్ధి చేసిన ఆయన నెల్లూరును మరింత అభివృద్ధి చేసేందుకు అధినాయకత్వం నిర్ణయం మేరకు పోటీచేస్తున్నారన్నారు. జిల్లావాసి అయిన అలాంటి వ్యక్తిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు అవినీతిమయమైన పార్టీలన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ఎన్నటికీ అధికారంలోకి రాలేరన్నారు. వయసు మీద పడడం, వడదెబ్బ కారణమో తెలియదుకానీ నిరాశ నిస్పృహతో ఏమి మాట్లాడుతున్నాడో తెలియక దిగజారి జంతువుల భాష మాట్లాడుతున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే బాబు దమ్ముంటే పార్టీ అధ్యక్ష స్థానం ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ఇవ్వాలని సవాల్ విసిరారు. దివంగత ఎన్టీరామారావు చంద్రబాబును జామాతా దశమ గ్రహం అని చెప్పారన్నారు. రాజకీయ జీవితం ఇచ్చిన కాంగ్రెస్‌కు, పిల్లనిచ్చిన మామకు పోటు పొడిచిన ఘనుడని ఎద్దేవా చేశారు. జగన్ అవినీతి సొమ్ముతో ముఖ్యమంత్రి కావాలని పగటి కలలు కంటున్నాడని ఇది ఎప్పటికీ నెరవేరదని ఆయన ఎదుర్కొంటున్న ఆరోపణల దృష్ట్యా జైలుకెళ్లడం ఖాయమన్నారు. చంద్రబాబు, జగన్ నీతి, విలువలు గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు కాంగ్రెస్‌వైపే ఉన్నారని, సుబ్బరామిరెడ్డి, ఉదయగిరి కాంగ్రెస్ అభ్యర్థి విజయరామిరెడ్డి గెలుపు ఖాయమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు కోటీశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాలసుధాకర్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.





సణుగుడు

8వ పేజీ కొరవ

క్షణంలో అర్జంట్‌గా మద్రాసుకు తీసుకపొమ్మని తరిమి పారేస్తారు. రోగి తమ వద్దకు రాగానే, నీ అదృష్టం బాగుంది నా దగ్గరకు సమయానికి వచ్చావు కాబట్టి సరిపోయింది కాని లేకుంటే శరీరం పుచ్చి పోయి పనికి రాకుండా పోయేదని భయపెట్టడం అలవాటై పోయింది. ఆ భయాన్నే కాసుల పంటగా మార్చుకోవడం వారి వ్యాపార కళా నైపుణ్యం.

ఇక సర్జరీల సంగతి చెప్పనే అవసరం లేదు. సాధారణ ప్రసవం అసాధారణ విషయంగా మారి పోయింది నెల్లూరులో. గర్భిణీ వస్తే చాలు, కత్తి పెట్టి కస కస కడుపు కోసి పారేస్తున్నారు. షుగర్ డాక్టర్ల గురించి ఎంత తక్కువగా చెప్పుకొంటే అంత మంచిది. పొగతోటలో వున్న రెండు డజన్ల మంది షుగర్ డాక్టర్లలో ఎంత మంది నిజమైన డాక్టర్లో అనుమానమే. వారి వృత్తి వైద్య అర్హతలేమిటో తెలియదు. కానీ ప్రతి ఒక్కరూ తామో అపర ధన్వంతరుల వలె ప్రచారం చేసుకొంటూ వుంటారు. ప్రతి ఐదు మందిలో ఒకరికి షుగర్ జబ్బు వుంటుందని అంచనా. వారిలో నూటికి తొంభై శాతం మంది రోగం గురించిన అవగాహన లేని అమాయకులే. ఆ అమాయకత్వమే ఈ షుగర్ డాక్టర్లకు రాబడి వనరు. రోగులను భయపెట్టి, డబ్బు పిండడంలో వీరికి వీరే సాటి. తాము చేసే వైద్యానికి, జరిపే పరీక్షలకు అసలు రోగానికి సంబంధమే లేకుండా వేలకు వేలు గుంజుకొంటున్నారు. వారిని చూసి నప్పుడే అన్పిస్తుంది – ఏ జన్మలో చేసిన పాపాలకు ఈ జన్మలోనే పరిహారం చెల్లించుకోవడం కోసం యముడు చేసిన ప్రత్యేక ఏర్పాటేమో అని.

ఒక్క నెల్లూరు అని ఎందుకనుకోవాలి. డాక్టర్లు, ఆస్పత్రుల విషయంలో దేశమంతా అదేరకంగా వుంది పరిస్థితి. మద్రాసు, హైదరాబాద్‌లలోని కార్పొరేట్ ఆస్పత్రులలో కొన్ని మరింత ఘోరంగా వున్నాయి. వైద్య రంగంలో తీవ్రస్థాయి సంస్కరణలు వచ్చినంత వరకు ఈ దుర్గతి తప్పదు.

నెల్లూరు డిఎంఅండ్‌హెచ్‌ఓ గారు నగరంలోని డాక్టర్ల విద్యార్హతలన్నిటినీ ఒకసారి పరిశీలించి, నిజమైన డాక్టరెందరో, డాక్టర్లుగా నటిస్తున్న యాక్టరెందరో నిగ్గు తేల్చడం అవసరం. మీనాక్షి సుందరివలె, హెమటాలజీ, పెథాలజీ వంటి అనుబంధ చదువులు చదివిన వారు చాలా మంది డాక్టర్లుగా రోగుల జీవితాలతో ఆటలాడుతున్నట్లు వార్తలు విన్పిస్తున్నాయి. అటువంటి వారిని గుర్తించి, కఠినమైన చర్యలు తీసుకోకుంటే అమాయక రోగుల ప్రాణాలు అన్యాయంగా బలైపోతాయి.

రాష్ట్రంలో ప్రళయం

మొదటి పేజీ కొరవ

ఫోటోలు తీసి పక్కరోజు పత్రికలలో ప్రచురించారు. అంత చిన్న ఉదంతం పైనే అంత విస్తృతస్థాయిలో ఆందోళన జరిపిన జగన్ బృందం, ఆయన్ను అరెస్టు చేస్తే వూరకే వుంటుందా? అందులోనూ ఇప్పుడు ఆంధ్ర ప్రాంతం మొత్తంలో ఉప ఎన్నికల వేడి అలముకొనివుంది. రాజకీయ కార్యకర్తలందరూ వ్యవస్థీకృతమై వున్నారు. కార్యకర్తల సమీకరణ జరిగి వుంది. ఈ దశలో అల్లర్లు సృష్టించడం చాలా సులువు.

ఈ నేపథ్యంలో పోలీసు కొంత ముందు జాగ్రత్తలు తీసుకొంటున్నది. దాన్ని ఆసరాగా చేసుకొని జగన్ ముందుగానే ఆగం మొదలు పెట్టేశాడు. కాంగ్రెస్, టిడిపిలు కలసి అల్లర్లు సృష్టించి, ఆ నెపం తనపై వేయబోతున్నాయనే ప్రచారం మొదలు పెట్టాడు. ఢిల్లీ కాంగ్రెస్ నేత వాయిలార్ రవి డిజిపితోను, సిబిఐ అధికారులతోనూ చర్చలు జరిపాడని కూడా ఆరోపించాడు. వాయిలార్ రవి అనామకుడు కాదు. ఆయన దిన చర్య సమస్తం బహిరంగ రహస్యం. ఎవరిని ఎక్కడ ఎప్పుడు కలుస్తున్నాడో అనుక్షణం సమాచారం వుంటుంది. వెంటనే మీడియా ప్రతినిధులు వుంటారు. డిజిపి వంటి ఉన్నత స్థాయి అధికారి ఆయన వద్దకు వస్తే మీడియాకు తెలియకుండా పోయే పరిస్థితి లేదు. అది తెలిసి కూడా చీకటిలో రాయి విసిరినట్లుగా డిజిపి మీద, వాయిలార్ రవి మీద ఆరోపణ గుప్పించాడు జగన్.

జగన్ రాజకీయ శైలి – అలనాడు హిట్లర్ దగ్గరుండిన డాక్టర్ పాల్ జోసెఫ్ గోబెల్స్‌ను తలపిస్తూ వుంటుంది. తప్పుడు ప్రచారాలతో, ఆధారం లేని ఆరోపణలతో, అసత్యపు ప్రకటనలతో ప్రజలను మభ్య పెట్టడం గోబెల్స్ నైపుణ్యం. అందులో జగన్ గోబెల్స్‌కు ఎంతమాత్రం తీసిపోడు. జగన్ స్వచ్ఛమైన రాజకీయవాది కాదన్నది ఆయన అభిమానులు సైతం అంగీకరించే నిజం. ఆయనకు ఎంతో నేర చరిత్ర వుంది. పరిటాల రవి హత్యతో సహా రాయలసీమలో జరిగిన లెక్కలేనన్ని ఫ్యాక్షన్ నేరాలతో సంబంధం వుంది. మంగలి కృష్ణ, మద్దెల చెరువు సూరి, భాను వంటి కిరాయి హంతకులతో సాన్నిహిత్యం వుంది. కానీ ఆయన మాట్లాడినంత అధికంగా విలువల గురించి, నైతిక ప్రమాణాల గురించి మరెవరూ మాట్లాడరు. 2004 ఎన్నికల నాటికి అప్పుల బాధలు పడలేక, బంజారాహిల్స్‌లో వున్న ఇంటిని అమ్మకానికి పెట్టిన కుటుంబం వారిది. 2009 ఎన్నికలు వచ్చేసరికి ఆయన బరోడా మహారాజ ప్రసాదాలను మరిపించే రీతిలో ఒకటికి మూడు ఇళ్లు కట్టుకొన్నాడు. ఒక్కొక్కటి 500 కోట్లకు పైన విలువ చేసే భూరి భవంతులవి. కానీ జగన్ మాట్లాడినంత అధికంగా అవినీతి గురించి మరెవరూ మాట్లాడరు. ఇప్పుడు అల్లర్ల విషయం కూడా అంతే. జగన్ అరెస్టు అయితే అల్లర్లు చేయవలసిన అగత్యం కాంగ్రెస్, టిడిపిలకు ఎందుకు వుంటుంది? కానీ సంఘటనలు జరుగుతాయో లేదో తెలియక ముందే, అసలు తన అరెస్టు వుంటుందో వుండదో స్పష్టం కాక ముందే, ప్రత్యర్థి పార్టీల మీద, వున్నత స్థాయి అధికారుల మీద దారుణమైన ఆరోపణలు చేసి, బురద పూసి, రోత పట్టించేస్తున్నాడు. జగన్ అరాచక రాజకీయ శైలికి ఇదొక భయంకరమైన ఉదాహరణ.

ఇంతకూ జగన్‌ను అరెస్టు చేస్తారా? చేయరా? చేస్తే, ఎప్పుడు? కోర్టుకు వెళ్లినప్పుడు న్యాయమూర్తి ఆదేశం మీదనా? లేక అంతకంటే ముందుగానా? ఆ పుణ్యం సిబిఐ కట్టుకొంటుందా? లేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ పూనుకొంటుందా? ఇప్పటి వరకు దాఖలు చేసిన ఛార్జిషీట్ల ప్రకారం జగన్‌ను అరెస్టు చేసినా బెయిల్ రాకుండా ఎంతకాలం ఆపగలరు? బెయిల్ దొరకడం కష్టమైన మనీ ల్యాండరింగ్ వంటి నేరాలకు సంబంధించిన ఆధారాలు దర్యాప్తు సంస్థల వద్ద వున్నాయా? ఇవన్నీ ప్రశ్నలే. ఏది ఏమైనా వచ్చే ఒకటి రెండు వారాలలో జగన్ విషయంలో చాలా కీలక పరిణామాలు సంభవించే అవకాశం వుంది.

అవి కేవలం పరిణామాలా లేక ప్రళయం వంటి పరిస్థితులా అన్నది వేచి చూస్తే తప్ప తెలియదు. జగన్ రాజకీయ శైలి, ఆయన అనుచరగణపు ఆవేశ పూరిత ప్రవర్తన తెలిసినవారు, జగన్ అరెస్టుతో రాష్ట్రంలో అలివిమాలిన హింస చెలరేగుతుందనే భయం వ్యక్తం చేస్తున్నారు. దాన్ని సమర్థంగా ఎదుర్కోవడం పోలీసుకు పెద్ద సవాలు. అయితే ఇవన్నీ కేవలం వూహాగానాలు మాత్రమే. అసలు జగన్‌ను నిజంగా అరెస్టు చేస్తారా లేదా అన్నది కూడా ఇంకా స్పష్టం కాలేదు.



నెల్లూరు ఎసి స్టేడియంలోని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని సన్మానించి మద్దతు ప్రకటిస్తున్న దృశ్యం.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

ఏకంగా హోంశాఖ కార్యదర్శి ఛాయారతన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మనీ సర్క్యులేషన్ స్కీం సంస్థల నిర్వాహకులతో కుమ్మక్కై బాధితులకు అన్యాయం చేస్తున్నారని మనీ సర్క్యులేషన్ స్కీం బాధితుల కమిటీ తరపున మందా బాబ్జీ, భాను, ఆనంద్‌లు ఈ ఫిర్యాదు చేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనరసింహను కలసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

కరపత్రాల ముద్రణ

కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో పార్లమెంటు అభ్యర్థి టి.సుబ్బరామిరెడ్డి విజయాన్ని కోరుతూ కరపత్రాలను ముద్రించారు. బాలసుధాకర్ తదితరులు వీటిని రూపొందించారు. ఇందిరమ్మ రాజ్యం సుబ్బరామిరెడ్డితోనే సాధ్యమని, దళితులందరూ కాంగ్రెస్‌కు ఓటువేయాలని కోరుతూ ముద్రించిన ఈ కరపత్రాలను సుబ్బరామిరెడ్డి, చిరంజీవిలు ఆవిష్కరించారు.

మోహన్‌బాబు పరామర్శ

బోగోలు మండలం పాత బిట్రగుంటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, కొర్శిపాటి గోపాలరెడ్డి మరణించడంతో వారి కుటుంబాన్ని సినీ నటుడు మోహన్‌బాబు ఇటీవల పరామర్శించారు. గోపాలరెడ్డి కుమారుడు శ్రీధర్‌రెడ్డి మంచి మిత్రుడు కావడంతో పరామర్శకు వచ్చాడు. కొంతసేపు కుటుంబ సభ్యులతో గడిపిన అనంతరం తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు.

ఇస్కాన్‌కు కేటాయించవద్దు!

మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి భోజనాల తయారీని ఇస్కాన్ సంస్థకు కేటాయించరాదంటూ మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం డిమాండ్ చేసింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిఐటియూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ అధికారుల నిర్ణయం వలన దీనిపై ఆధారపడి గత కొన్నేళ్లుగా జీవిస్తున్న వారు వీధిన పడతారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఇస్కాన్‌కు కేటాయించే విషయాన్ని మానుకోవాలని కోరారు.

జనవాణి

2వ పేజీ కొరవ

సాక్షిపత్రిక, టీవీల్లో వేలాది మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. బ్యాంక్ అకౌంట్లు సీజ్ చేయడం వల్ల ఈ ఉద్యోగుల కుటుంబాలన్నీ వీధిలో పడతాయి. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన మంచి పనుల వల్ల రాష్ట్రంలో లబ్ధిపొందని కుటుంబం లేదు. జగన్‌ను అణగదొక్కను ఎటువంటి నియంతృత్వ పోకడలకు ప్రభుత్వం, సిబిఐ పాల్పడ్డా అంతిమంగా ఆయనకే మేలు జరుగుతుంది.

వైవి రామానుజస్వామి నెల్లూరు

ఎస్పీ అభినందనీయుడు!

నెల్లూరు బోడిగాడితోటలోని అనాథ పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పించను ఎస్పీ బి.వి.రమణకుమార్ 'క్యాప్' ప్రాజెక్టును చేపట్టడం అభినందనీయం. జిల్లాలో ఎంతోమంది పోలీసు అధికారులు పని చేశారు. కాని సామాజిక స్పృహతో అట్టడుగు వర్గాల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు వారి మంచి చెడ్డలు చూడడం మామూలు విషయం కాదు. ఈ ప్రాజెక్టును భవిష్యత్తులో నెల్లూరుకు వచ్చే ఎస్పీలు కూడా నడపవలసిన గురుతర బాధ్యత స్వీకరించాలి.

ఎస్.బాబురావు కావలి


ఒక్కరమే మిగులుతాము!

మొదటి పేజీ కొరవ

జీతాలకు సరిపడా సొమ్ము ఇప్పటికే కొత్తగా ప్రారంభించిన బ్యాంకు ఖాతాలలో జమ చేసారట. దీర్ఘ కాలం సిబిఐ ఒత్తిడి తట్టుకొని సాక్షి నడపడానికి ప్రజల నుంచి పెట్టుబడులు స్వీకరించే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ సామాజిక వర్గానికి చెందిన అసంఖ్యాక సంపన్నులు సాక్షికి అండగా నిలబడడానికి సిద్ధపడుతున్నారు కాబట్టి, వారి సహకారంతో, పెట్టుబడులు సేకరించాలన్నది ప్రణాళిక. బెయిల్ మీద బయటకు వచ్చిన విజయసాయి రెడ్డి ఈ విషయంలో చట్టబద్ధమైన పద్ధతి కోసం కసరత్తు జరుపుతున్నారు. జగన్ మీద ఆయన సామాజిక వర్గంలో వున్న అభిమానం తీరు చూస్తే కనీసం ఐదారు వందల కోట్ల రూపాయలు చిన్న చిన్న మొత్తాల రూపంలో సేకరించగలమని విజయసాయి రెడ్డి ఆశిస్తున్నాడు. అంత మొత్తం సమకూరితే, మరొక రెండేళ్లపాటు సాక్షి ప్రచురణకు అడ్డంకులేవీ వుండవు.

పదరంగం -16

నిర్వహణ : బాబాజీ



అడ్డం

1. చేపట్టి పెండ్లాడటం (5)
3. యజమాని (2)
4. రమని పిలవండి! (2)
6. సగం (2)
7. పితరులకు నెలనెలా పెట్టేది – తారుమారైంది (3)
8. సేవిక (5)
10. గో క్షీరం (4)
12. భీముడు (5)
14. పుట్టె విస్ఫోటనం (5)
16. తమిళ హాస్య నటి సరళ ఇంటి పేరు (2)
18. ఇంగ్లీషు ఆవు (1)
20. తెల్లవారుఝాము (3)
22. బ్రతుకు ఆట (5)
23. క్షీరం (2)
24. జరీ (4)
26. ఆభరణం (2)
27. రోగి ఆహారం (3)
28. ఖండించబడినది (2)
29. ఇంగ్లీషు గూఢచారి (1)
30. మహిళ (1)

నిలువు

1. పరంపరగా కొనసాగడం (4)
2. విధివ్రాత (4)
3. సెల్ఫిష్‌నెస్ (3)
4. టైపు, విధానం (2)
5. గుడ్డ మీద మరకలు (4)
7. మానవత్వం కలవాడు (4)
9. కోరికలు తీర్చే చెట్టు (4)
10. అయిదు తరువాత? (2)
11. వామాచార పూజారులు (5)
13. ఒడ్డు, గట్టు (2)
15. కోరిక (2)
17. జాగృత పరుచువారు, స్తోత్ర పాఠకులు (5)
19. తెలుగు రీడర్ (4)
20. వేప పత్రములు (4)
21. శిరస్సు (2)
22. తేడా (3)
24. తగాదా (3)
25. ఋషి (3)
26. గోరు (2)


సమాధానాలు

పదరంగం -15

1ప్ర	ణ	2వం		3కం			4చే	5వ		6యూ
శి		7చ	వి		8ఆ	లా	ప	న		త
ష్యు		నా			హా			9బో	ధ	న
డు		10శి	రో	11ధా	ర్యం			జ		
	12క	ల్పం		న్యం		13కౌ	14పీ	నం		15వి
16ట్రీ			17జో		18జా	మా	త		19పే	క
	20గా	21జు	ల	మ	లా	రం		22హ		ట
23త	రా	జు			ది		24వా	క్కు		క
	బం		25ఆ	26న			మ		27క	వి
28ప		29రా		వీ		30సం	భా	31వ	న	
32స	హ	జీ	వ	న	ము		33గం	ధ	కం	

సంక్షిప్త సింహపురి

టొరెంటో సదస్సుకు నెల్లూరు శాస్త్రవేత్త!



నెల్లూరీయుడు, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాస్త్రవేత్త డాక్టర్ జగదీష్‌కు జూన్ 3తేదీ నుండి 7తేదీ వరకు టొరెంటో (కెనడా)లో జరుగనున్న 19వ ప్రపంచ హైడ్రోజన్ ఎనర్జీ సదస్సులో పాల్గొనమని ఆహ్వానం అందింది. డాక్టర్ జగదీష్ ఇప్పటికే 30 దేశాలలో జరిగిన అంతర్జాతీయ వైజ్ఞానిక సదస్సుల్లో పాల్గొని తన పరిశోధనలను సమర్పించారు. ప్రతిష్టాత్మక మార్గరేట్ నోబుల్ ఫౌండేషన్, సీటెల్, అమెరికా అవార్డు, మరో 15 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకొన్నారు.

రంగంలోకి దిగిన కళా బృందాలు



కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఓటు విలువ గూర్చి ప్రజలకు తెలియజేయను ఎంపిక చేసిన కళా బృందాలు రంగంలోకి దిగాయి. ఓ మోడల్ కళాబృందం కార్పొరేషన్ కార్యాలయంలో శింగంశెట్టి మురళీమోహన్ రచించి దర్శకత్వం వహించిన 'ఓటు విలువ తెలుసుకో' నాటికను ప్రదర్శించారు. ఎంపిక చేసి శిక్షణ పొందిన కళా బృందాలు వెంటనే రంగంలోకి దిగుతాయని ఎపి జానపద కళాకారుల సంఘం తెలిపింది.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

నెల్లూరు కార్పొరేషన్‌లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ సిపిఎం పార్టీ నేతృత్వంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సొసైటీ కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికుల మాదిరి సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు, దుస్తులు, పిఎఫ్ స్లిప్‌లు మంజూరు చేయాలన్నారు. ప్రతి నెల పనికి తగ్గట్టు 10 వేల రూపాయల జీతం చెల్లించాలని సంఘం నాయకుడు మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సొసైటీ కార్మికులకు వారాంతపు సెలవులు అందించను ప్రయత్నిస్తానని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ టిఎస్‌ఆర్ ఆంజనేయులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

సంగమేశ్వరశాస్త్రి కన్నుమూత!



ఏ తల్లి కన్న బిడ్డో గాని, నెల్లూరుకు ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా వచ్చిన వేదాంతం సంగమేశ్వరశాస్త్రి 17తేది జయభారత్ హాస్పిటల్‌లో కన్నుమూశారు. శాస్త్రి జిల్లాలోని మత్స్యకార గ్రామాల్లో ఆర్ఎస్ఎస్ పట్టు బిగించేలా గట్టి ప్రయత్నం చేసిన వ్యక్తి. జయభారత్ హాస్పిటల్, వాత్సల్య అనాధ శరణాలయం, వానప్రస్థ వృద్ధాశ్రమం, భారతీయ విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూళ్లను నిర్మించి విజయవంతంగా నడిపి తన శక్తి సామర్థ్యాలను లోకానికి చాటారు. ఎందువల్లో ఇటీవల నెల్లూరును వదలి వెళ్లిన ఆయన కుర్తాళంలోని సిద్దేశ్వర పీఠాధిపతి ద్వారా సన్యాసాశ్రమం స్వీకరించి వాత్సల్యానంద స్వామిగా మారి విశాఖపట్నంలో లలితా పీఠం నిర్వహణ చూస్తుండినారు. ఈ నెల 7తేదీ దెందులూరు దగ్గర జరిగిన కారు ప్రమాదంలో గాయపడిన ఆయన్ను నెల్లూరులో వుంచి వైద్యమందిస్తుండగా ప్రాణాలు వదిలారు.

టిఎస్‌ఆర్ ప్రచార శైలినే వేరు!



నెల్లూరు పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డి ప్రచారం జరుపుతున్న తీరు ఆయన ప్రత్యర్థులను విస్తుపోయేలా చేస్తోంది. 4తేది నెల్లూరు వచ్చిన ఆయన కాంగ్రెస్‌పార్టీలోని నేతలందరితోనూ మాట్లాడి అసమ్మతి అనేది లేకుండా ప్రచారం మొదలయ్యేలా చేశారు. లలిత కళా పరిషత్ నెల్లూరుశాఖ ప్రారంభం, కలిగిరి సభకు పిసిసి అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ రాక, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి రెండేసి రోజుల ప్రచారంతో పార్లమెంటరీ స్థానం పరిధిలోనికి వచ్చే నియోజకవర్గాల్లో ఆయన తొలివిడత ప్రచారం పూర్తయ్యింది. కార్యకర్తల పరిచయ సదస్సు, బహిరంగ సభలు సుబ్బరామిరెడ్డి వ్యక్తిత్వాన్ని తెలియజేసే సినిమాల ప్రదర్శన, బ్రోచర్లు, కరపత్రాలు మారుమూల ప్రాంతాలకు సైతం నామినేషన్‌కు ముందే వెళ్లిపోయాయి. ఆయన రెండవ విడత, మూడవ విడత ప్రచారాలు ఎలా చేస్తారన్న దానిపై అందరి దృష్టి కేంద్రీకృతమై వుంది.

రైతు లోకం

యంత్రాల వినియోగంతో వరినాట్లు సులభం!

ప్రస్తుతం జిల్లాలో రెండవ వరిపంటకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. వరిసాగులో అధికశాతం ఖర్చు కూలీలకు వెచ్చించాల్సి వుంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఒకేసారి ప్రారంభం కావడం వలన కూలీలు అందుబాటులో లేక రైతులు ఇబ్బంది పడుతుంటారు. ఈ క్రమంలో యంత్రపరికరాల వినియోగంతో వరినాట్లు వేసే దగ్గర నుంచి వరికోత కోసే వరకు కూలీల కొరత నుంచి గట్టెక్కే అవకాశం వుంటుంది. ఈ యంత్రాల ద్వారా జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో గత సంవత్సరం ప్రయోగాత్మకంగా వరినాట్లు వేయడం జరిగింది.

కలుపుతీత యంత్రం

వరుసగా నాటిన వరిలో ఈ యంత్రాన్ని వుపయోగించవచ్చు. శారీరక శ్రమ లేకుండా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పెట్రోల్‌తో నడిచే కలుపు తీసే యంత్రాన్ని రూపొందించింది. ఇది 1.2 హెచ్.పి. పెట్రోల్ ఇంజన్‌తో పని చేస్తుంది. ఎనిమిది కటింగ్ బ్లేడ్లు కలిగి, భూమిలో దిగబడకుండా వుండి కలుపు తీసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇసుక నేలల్లో గంటకు 25 సెంట్లలో కలుపు తీయవచ్చు. యంత్రం వాడకం వలన 90శాతం కలుపు నివారణ అవుతుంది.

లేజర్ లెవలర్

పొలాన్ని చదును చేసేందుకు ఇటీవల లేజర్ లెవలర్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. ఈ యంత్ర పరికరాన్ని ట్రాక్టర్‌కు అమర్చి వాడుతారు. ఇది అత్యంత ఖచ్చితత్వంలో నేలను చదును చేస్తుంది. ఎకరా విస్తీర్ణం చదును చేసేందుకు రెండు గంటల సమయం పడుతుంది. ఈ పరికరం వాడిన పొలంలో సాగునీటి వినియోగం తగ్గి ఎరువులు సద్వినియోగమవుతాయి.

ధాన్యం తూర్పార బట్టే యంత్రం

పవర్‌టిల్లర్ లేదా ట్రాక్టర్‌కు ఫ్యాన్ అమర్చి రైతులు ధాన్యాన్ని తూర్పారబడుతుంటారు. ఈ ఫ్యాన్ల వాడకం ప్రమాదకరం. పైగా గింజలు పూర్తిగా శుభ్రం కావు. ఈ పనిని సమర్థవంతంగా నిర్వహించేందుకు 5హెచ్.పి ఇంజన్‌తో నడిచే యంత్రం మార్కెట్లోకి విడుదలైంది. ఇందులోని బ్లోయర్ జల్లెడలు ధాన్యంలోని తాలు గింజలు, మట్టి గడ్డలను తొలగించి శుభ్రమైన ధాన్యాన్ని ఇస్తాయి. ఒక గంట వ్యవధిలో ఎకరా ధాన్యాన్ని నలుగురు కూలీల సాయంతో తూర్పారబట్టవచ్చు. పై యంత్రాల కొనుగోలు, వినియోగం తదితర సమాచారం తెలుసుకొనేందుకు, వ్యవసాయశాఖ అధికారులను గాని, వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలను గానీ రైతులు సంప్రదించవచ్చు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

జగన్‌ను తిడ్తే జనం సహించరు!

- ప్రచార సభలకు స్వచ్ఛందంగా తరలివస్తున్న జనం.
- జగన్మోహన్‌రెడ్డి సిఎం అయితేనే స్వర్ణయుగం: మేకపాటి
- వేలాదిగా చేరుతున్న కాంగ్రెస్, తెలుగుదేశం కార్యకర్తలు.
- ఏకపక్షంగా పద్దతిస్తున్న మైనార్టీలు.
- ఎస్సీ, ఎస్టీలదీ అదే దారి.
- ధీటుగా పనిచేయండి: కార్యకర్తలకు కాకాణి పిలుపు.
- ఆనం సోదరులకు రాజమోహన్‌రెడ్డి సవాల్.
- వైఎస్ఆర్‌సిపికే అఖండ మెజార్టీ ఇవ్వమని అభ్యర్థన.

నెల్లూరు లోక్‌సభ, ఉదయగిరి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దల దిమ్మదిరిగేలా నెల్లూరు ప్రజలు తీర్పు ఇవ్వాలని మేకపాటి రాజమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. కావలిలోని ఆర్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు లబ్ధిపొందిన ఆనం బ్రదర్స్ ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డిని విమర్శించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని, వారికి సరైన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు. తన వద్ద జగన్మోహన్‌రెడ్డి 800 కోట్ల రూపాయల డబ్బు ఉంచారని ఆనం వివేకానందరెడ్డి చేస్తున్న ప్రచారం పచ్చి అబద్ధమన్నారు. తాను రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎటువంటి ప్రతిఫలం పొందకుండా ఎన్నోసార్లు పార్టీకి విరాళం ఇచ్చానన్నారు. నెల్లూరులో పోటీచేయను సుబ్బారామిరెడ్డి ముందుకు రాకుంటే ఆనం సోదరులలో ఎవరో ఒకరు తనపై పోటీ చేసి ఓడిపోయి ఉండేవారన్నారు. జగన్మోహన్‌రెడ్డిని విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకొన్న కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని రాజమోహన్ రెడ్డి ప్రజలను కోరారు.



సంగం ఎన్నికల ప్రచార సభలో జనానికి అభివాదం చేస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి.

మేకపాటికి మెజార్టీనివ్వండి!

కావలి సభలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఉద్వేగంగా మాట్లాడారు. రాజశేఖర్‌రెడ్డి మరణించిన తర్వాత సగం చచ్చిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జగన్ ఆ పార్టీకి రాజీనామా చేయడంతో పూర్తిగా చనిపోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అంపశయ్యపై ఉందని, ఆ పార్టీని మోసేందుకు నలుగురు వ్యక్తులు ఆజాద్, సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు బొత్సా సత్యనారాయణ, నటుడు చిరంజీవి సిద్ధమయ్యారని ఎద్దేవా చేశారు. ఈ సభకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు.

ఆనం బ్రదర్స్... మీ ఆటలు సాగవిక!

నెల్లూరు నగరంలోని మూడవ డివిజన్‌లో వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాసనగర్‌లో ఏర్పాటుచేసిన సభలో రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారిని బెదిరిస్తున్నారట. నెల్లూరులో ఆనం బ్రదర్స్ గుత్తాధిపత్యం, ఆటలు ఇక సాగవు. నేను వందల, వేల కోట్ల రూపాయలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి డబ్బు తీసుకొన్నట్లు చేస్తున్న ప్రచారంలో అణువంత కూడా నిజం లేదు. సొంత డబ్బులే కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం గతంలో వెచ్చించాను.

మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని మరణానంతరం దోషిగా నిలబెట్టాలని ప్రయత్నం చేశారు. దాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ పార్టీని వీడాను. ఎమ్పీ పదవికి రాజీనామా చేశాను. వైఎస్ ఆశయాలు నెరవేర్చగలడనే నమ్మకం మెండుగా ఉంది కాబట్టే జగన్మోహన్‌రెడ్డితో కలసి నడుస్తున్నానన్నారు. నెల్లూరులో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తిక్కవరపు సుబ్బారామిరెడ్డి జిమ్మిక్కులతో గెలవాలని నానా పాట్లు పడుతున్నట్లు రాజమోహన్‌రెడ్డి విమర్శించారు.

మైనార్టీ రిజర్వేషన్లు వైఎస్ పుణ్యమే!

ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించి ప్రభుత్వం నుంచి అన్నివిధాల లబ్ధిపొందేటట్లు చేసిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. పొదలకూరు మండలంలో జరిగిన నాగూర్ ఖాదర్‌వలీ దర్గా గంధమహోత్సవంలో పాల్గొని చదివింపులు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు. ఆయన మరణం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచిందన్నారు. వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి కృషి చేయాలన్నారు.

రాజకీయాలు మారుతాయి

జూన్ నెలలో జరుగనున్న ఉపఎన్నికలు ప్రతిష్టాత్మకమైనవని ఈ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో పెను మార్పులు ఉంటాయని నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి పోటీచేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల దర్గామిట్టలోని మేకపాటి అతిథి గృహంలో జరిగిన నెల్లూరు రూరల్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. రానున్న రోజుల్లో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. 2014లో కేంద్రంలో వైకాపా కీలకపాత్ర పోషిస్తుంది. ఈ ఉపఎన్నికలు రెఫరండం కాదని సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రకటించడం ఆయన పలాయన వాదానికి నిదర్శన మన్నారు.



కందుకూరులో ఎన్నికల ప్రచారసభలో మాట్లాడుతున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి.

ఆత్మకూరులో మంత్రి ఏమి చేశాడు?

ఆత్మకూరు నియోజకవర్గంలో ఈ మూడేళ్లలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ఉదయగిరి అసెంబ్లీ వైకాపా అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. స్వంత నియోజకవర్గానికే ఏమీచేయలేని ఆయన ఉదయగిరి అభివృద్ధి చేస్తాడట. ప్రగల్భాలు ఆపి పనులు చేస్తే ప్రజలు సంతోషిస్తారన్నారు. నెల్లూరు పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న తెలుగుదేశం అభ్యర్థిని కూడా విమర్శించారు.



తండ్రికి మద్దతుగా గడపగడప ఎక్కి ఓట్లు అభ్యర్థిస్తున్న మేకపాటి గౌతమ్‌రెడ్డి.

వేషాలు చేతకావు!

ఆనం సోదరుల మాదిరి వేషాలు వేయడం తమకు చేతకాదని మేకపాటి రాజమోహన్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. ఆత్మకూరులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికీ ఆనం సోదరులు ఏ.సి.సుబ్బారెడ్డి పేరు చెప్పుకొని బతుకుతున్నారు. మహానేత వైఎస్ఆర్ పెట్టిన రాజకీయ బిక్షతో ఆనం

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com